నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం | సెప్టెంబర్ 11, 2024 | www.navatelangana.com

17న గణేష్ విగ్రహాల నిమజ్జనం

- 18న జెండా బాలాజి ఊరేగింపు : సార్వజనిక్ గణేశ్ మండలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఈ నెల 17న గణేష్ విగ్రహాల నిమజ్జన శోభయాత్ర నిర్వహించనున్నట్టు సార్వజని గణేష్ మండలి నిర్వాహకులు బంటు గణేష్ మంగళవారం తెలిపారు. నిజామాబాద్ నగరంలోని దుబ్బా ప్రాంతం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు శోభాయాత్ర మొదలవుతున్నదని తెలిపారు. శనివారం కొలువుదీరిన గణనాథుల నిమజ్జనంపై ఈసారి కూడా గందోరగోళం నెలకొందని అన్నారు. బుధవారం పౌర్ణమి ఉండడంతో పాటు బాలాజీ జెండా ఊరేగింపు ఉంటుందని, కావున జెండా పండగకు ముందే గణేష్ నిమజ్జనం చేయడం ఆనవాయితీగా వస్తున్నట్టు తెలిపారు. అందుకే మంగళవారం 11వ రోజు శోభాయాత్ర నిర్వహించడానికి నిర్ణయించినట్టు తెలిపారు.

వరప్రదాయిని.. నిజాంసాగర్ ప్రాజెక్ట్

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-నిజాంసాగర్


ప్రాజెక్టును పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నిజాంసాగర్ ప్రాజెక్ట్ రైతులకు వరప్రదాయిని అని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్రాజెక్టును సందర్శించారు. ఈసారి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిందన్నారు. రైతులు సాగునీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని, అలాగే ప్రాజెక్టు వద్ద వచ్చే సందర్శకుల మౌలిక సౌకర్యాలు, బోటింగ్ సౌకర్యం కొరకు కృషి చేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోలమాన్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఈఈ శివప్రసాద్, కాంగ్రెస్ మండలాధ్యక్షులు పులి శ్రీనివాస్, బిల్లా రామ్మోహన్, అధ్యక్షులు వై.నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

చిట్యాల ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శం

- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు

నవతెలంగాణ-కంఠేశ్వర్

చిట్యాల ఐలమ్మ ఉద్యమ స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శమని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు తెలిపారు. ఈ మేరకు మంగళవారం చిట్యాల ఐలమ్మ 39వ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహం వద్ద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు మాట్లాడుతూ చిట్యాల ఐలమ్మ దున్నేవాడికే భూమి దక్కాలని, కష్టం చేసి పండించిన రైతుకు పంట మిగిలాలని నాటి దొరలు, జాకీర్దారులు, విస్నూర్‌రామ్ చంద్రారెడ్డి లాంటి భూస్వాములు చేసే అరాచకాలు, దౌర్జన్యాలను, వెట్టిచాకిరి ని వ్యతిరేకించటంతో పాటు వారు మద్దతిస్తున్న నిజాం నిరంకుశ రాచరిక పరిపాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున కమ్యూనిస్టుల నాయకత్వంలో ఏర్పడిన సంఘం ఆంధ్ర మహాసభ పేరుతో ప్రజలను సమీకరించి దొరలను ఎదిరించి తమ పంటను తాము స్వాధీనం చేసుకొని ఎదురెడ్డి నిలిచిన వీర వనిత అని అన్నారు. దున్నే వాడికి భూమి కావాలని భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో చిట్యాల ఐలమ్మ కీలక పాత్ర పోషించారని ఆనాటి ఆమె స్ఫూర్తి నేటి యువతరానికి ఎంతో ఆదర్శప్రాయంగా ఉంటుందని తెలిపారు.

నిజాం రాజుకు తెలంగాణలో ఉన్న దొరలు భూస్వాములు అంట కాగుతూ పేదలు బడుగు బలహీన వర్గాల ప్రజల పైన దౌర్జన్యాలు అరాచకాలు చేయటాన్ని సహించలేని అనేకమంది పేదలు కుల, మత ప్రాంతీయ విభేదాలను విడనాడి ఐక్యంగా పోరాడటంతో గ్రామాలు విముక్తి చెందాయని అక్రమంగా భూస్వాములు కాజేస్తున్న భూములు పేదలకు దక్కాయని తెలిపారు. అదే స్ఫూర్తితోనే ఇప్పటికీ కమ్యూనిస్టులు ఉద్యమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నూర్జహాన్, జిల్లా కమిటీ సభ్యులు విగ్నేష్, నాయకులు కటారి రాములు, నాయక్‌వాడి శ్రీనివాస్, రఫిక్, పందరి తదితరులు పాల్గొన్నారు.

ఎవరెస్ట్ అధిరోహించేందుకు తోడ్పాటు అందిస్తాం

- పర్వతారోహకుడిని సన్మానించిన ఎమ్మెల్యే, కలెక్టర్, సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్



మారుతిని సన్మానిస్తున్న కలెక్టర్

పర్వతారోహణ పట్ల అభిరుచిని పెంపొందించుకుని ప్రపంచ ప్రఖ్యాత పర్వతాలను అధిరోహిస్తున్న నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం నాళేశ్వర్ గ్రామానికి చెందిన ఏ.మారుతిని మంగళవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగేనవార్ అభినందించి శాలువాలతో సత్కరించారు. ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించేందుకు సమాయత్తమైన మారుతి, ఇప్పటికే కిలిమంజారో పర్వతాన్ని, రష్యాలోని అత్యంత ఎత్తైన ఎల్బ్రోస్ పర్వతాలను అధిరోహించడం ఎంతో గొప్ప విషయమని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అభినందించారు. జిల్లాకు, రాష్ట్రానికి పేరు ప్రఖ్యాతులు తెస్తున్న మారుతి ఎవరెస్టు అధిరోహణ లక్ష్యాన్ని సైతం సాధించాలని ఆకాంక్షించారు. పర్వతారోహకుడు మారుతికి అన్ని విధాలుగా తోడ్పాటును అందిస్తామని అన్నారు.

నీళ్లు, నిధులు వృథా

- దాల్మల్ కుంట ఆత్మఘోష
- చెరువు కట్ట కట్టి కాలువలు మరిచారు
- కట్ట నిర్మాణంలో సైతం నాణ్యతాలోపం.. కట్టపై గుంతలు.. బుంగలు
- పోచారం పేరును వాడేసుకుంటున్నారు..?

నవతెలంగాణ-నసురుల్లాబాద్


దాల్మల్‌కుంట..


చెరువు నిండటంతో వాగు ద్వారా మంజీరాకు ప్రవహిస్తున్న నీరు


చెరువు కట్ట నాసిరకంగా నిర్మించడంతో కట్టపై ఏర్పడ్డ పెద్ద గుంత

చెరువుకట్ట పనుల్లో అధికారులు, కాంట్రాక్టర్, నాయకుల చిత్తశుద్ధి మరోసారి బయటపడింది. రూ.లక్షలాది రూపా యలు వెచ్చించి చెరువు కట్ట నిర్మాణం పనులు చేపట్టిన పనుల్లో డొల్ల వెలుగు చూసింది. కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామాల్లో ఉన్న దాల్మల్ కుంట ఆత్మఘోషపై కథనం..

ఈ చెరువు నిర్మాణం చేస్తే చెరువు కట్ట కింద ఉన్న సుమారు 108 ఎకరాల బీడు భూములు సస్యశ్యామలం అవుతాయని రైతులు కోరడంతో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తు సుమారు 8 సంవత్సరాల క్రితం 70 లక్షల నిధులు మంజూరు చేసినట్లు సమాచారం. గత నాలుగు సంవత్సరాల క్రితమే కట్ట పనులు పూర్తి అయ్యాయి. అయితే అప్పటి నుంచి ఇప్పటి వరకు చెరువు నుండి ఒక్క చుక్క నీరు కూడాసాగునీటి రైతులు కు ఉపయోగపడలేదని, చెరువులో ఉన్న సాగునీటిని వృథాగా వాగులోకి దాని నుంచి మంజీరాకు వదిలేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చెరువు సరే.. కాలువలు ఏవి?

చెరువు నిర్మించారు కానీ చెరువు అలుగు నీళ్ల వెళ్లేందుకు కాలువ లేదు. అలాగే పంట పొలాలకు వెళ్లేందుకు సాగునీటి కాలువలు తవ్వడం మర్చిపోయారు. దీనితో ప్రతి సంవత్సరం చెరువు నిండడం, కట్ట బలహీనంగా ఉంది అంటూ చెరువు నీళ్ల వదిలేస్తున్నారు. చెరువుకు కాలువలు లేక పోవడంతో చెరువు నీళు పంట పొలాల నుంచి వెళ్లడంతో పంటపొలాలు దెబ్బ తింటున్నా యంటు రైతులు ఆందోళన చెందుతున్నారు. డాల్మాల్ కుంట చెరువు కట్ట నిర్మాణంలో సైతం నాణ్యత ప్రమాణాలు పాటించలేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులపై ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.

చెరువు కట్టకు బుంగలు

చెరువు కట్ట నిర్మాణం నాణ్యత లోపించడంతో గత సంవత్సరం నుండి చెరువుకు బుంగలు పడుతున్నాయి. చెరువుకు బుంగపడి సాగునీరు పంట పొలాల్లోకి వస్తుందని ఇటీవల బాన్సువాడ సబ్ కలెక్టర్ కు రైతులు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందిస్తూ ఆ బుంగను జేసిబి తో పూడ్చారు. చెరువు కట్ట నాణ్యత లోపించడంతో గురువారం చెరువు కట్ట మధ్యలో పెద్ద బొయ్యారం ఏర్పడిం చెరువు కట్టకు ప్రమాదంగా మారింది. ఇది చూసిన అధికారులే అవ్వక్కయ్యారు. చెరువు కట్ట నిర్మాణం నాణ్యత ప్రమాణాలను పాటించకపోవడం వలన ఇలాంటి బోయ్యారం ఏర్పడిందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కట్ట నిర్మాణం కోసం లక్షలాది రూపాయలు నీటి పాలు అయ్యాయని, చెరువు నిర్మాణం జరిగితే తమ పంట పొలాలకు సాగునీరు అంది తమ బీడు భూములు సైతం సస్యశ్యామలం అవుతాయనే ఆశ నిరాశగానే మిగిలిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పోచారం ఆదేశాలూ బేఖాతర్

బాన్సువాడ నియోజకవర్గంలో దీర్ఘకాలకు పనులు చేసి ఆదర్శంగా ఉండాలనే ఆకాంక్షతో పోచారం శ్రీనివాస్‌రెడ్డి.. కోట్లాది రూపాయలు నిధులు మంజూరు చేస్తే స్థానిక నాయకులు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను మర్చిపోతున్నారు. దీనితో పోచారం లక్ష్యం నీరుగారిపోతుంది. నిర్మాణ దశలోనే నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులకు కాంట్రాక్టర్లకు పదేపదే సూచనలు, ఆదేశాలు, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నప్పటికీ కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం, అధికారులు నిర్లక్ష్యంగా పనులు చేపడుతున్నారు. స్థానిక నాయకులు కాంట్రాక్టర్‌గా అవతారం ఎత్తి కోట్లాది రూపాయలతో చేసే అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని స్థానిక నేతలకు అధికారులు చెప్పలేకపోతున్నారు. దీనితో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేపడుతున్నారని ఆరోపణ వ్యక్తం అవుతుంది. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి మంచి పేరు తేవాలనే కోరిక స్థానిక నాయక కాంట్రాక్టర్‌లో లేకుండా పోయింది. స్థానిక నేతలు కాంట్రాక్టర్లుగా మారి పోచారం పేరు వాడుకొని అభివృద్ధి పనుల్లో నాసిరకం పనులు చేస్తున్నారంటూ ప్రజలు ఆరోపిస్తున్నారు.

రైతులకు ఉపయోగం లేని చెరువు

నిజ్జిని నాగన్న.



గ్రామం లో నిర్మించిన దాల్మల్ ఉంటా చెరువు కట్ట పనులు బాగా లేకపోవడం వలన చెరువుకు బుంగలు పడుతున్నాయి. చెరువు ఉన్నా.. పూర్తిస్థాయిలో నిండుతున్న రైతులకు మాత్రం ఎలాంటి ఉపయోగం జరగడం లేదు. కాలువలు నిర్మించిన చెరువు నీటిని విడుదల చేస్తే పంటలకు ఉపయోగం.

కాలువలే కట్టలేదు

భాస్కర్ రైతు



చెరువు కట్ట నిర్మాణంలో నాణ్యత లేకపోవడంతో చెరువుకు బుంగలు పడుతూ నీటి లీకేజీతో మా పంటలకు తీవ్ర నష్టం జరుగుతుంది. కట్ట నిర్మాణంలో నాణ్యత లేదు. కట్ట నిర్మించినా కాలువలు నిర్మించకపోవడంతో నీటిని ఉపయోగించుకోలేకపోతున్నాం.

చెరువును ఉపయోగంలోకి తెస్తాం

జగదీశ్వర్. డిప్యూటీ ఇంజనీర్ బాన్సువాడ

డాల్మల్ కుంట చెరువును ఉపయోగంలోకి తీసుకువచ్చి రైతులకు సాగునీరు అందిస్తాం. గతంలో పనులు ఏం చేశారో నాకు తెలియదు. చెరువు మిషన్ కాకతీయ పథకంలో నిర్మించారని, ఇందులో ఎవరి తప్పిదం ఉందో తనకు తెలియదన్నారు. చెరువు పునర్ధరణ కోసం ప్రతిపాదనలు పంపమన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించాలి

- గురుకులాలు, వసతిగృహాల్లో శిబిరాలు చేపట్టాలి : కలెక్టర్

వతెలంగాణ-కామారెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్

జిల్లాలోని మైనార్టీ, సోషల్ వెల్ఫేర్, జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు, వసతి గృహాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు చేయించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. వైరల్ జ్వరాలు ఉంటే రక్త పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్య విషయాలను పరిశీలించాలని ఆదేశించారు. విద్యార్థులకు అనారోగ్య సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో రెసిడెన్షియల్, మైనారిటీ, జ్యోతిబాపూలే వసతి గృహాల ప్రిన్సిపాల్‌లతో, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. మైనర్, మేజర్ మరమ్మతులుంటే గుర్తించి ప్రతిపాదనలు తయారు చేయాలని సూచించారు. జిల్లా వసతి గృహల సంక్షేమ అధికారులు క్షేత్రస్థాయిలో వసతి గృహాలను సందర్శించి కావలసిన మరమత్తులను గుర్తించాలన్నారు. స్లాబ్ రిపేర్, పైప్ లైన్ లీకేజీ, మరుగుదొడ్ల మరమ్మత్తులు వంటి వాటిని గుర్తించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపాలని సూచించారు. ఈ సమావేశంలో డిఈవో రాజు, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారిని రజిత, ఇంచార్జ్ జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్, వివిధ గురుకుల పాఠశాలల ఆర్‌సిఓలు, ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

బాన్సువాడలో ఉపఎన్నిక జరిగేనా..?

- హైకోర్టు తీర్పుపై చర్చనీయాంశం

నవతెలంగాణ-బాన్సువాడ(నసురుల్లాబాద్)


బాన్సువాడ పట్టణం

ఒక పార్టీలో నుంచి ఎమ్మెల్యేగా గెలుపొంది మరో పార్టీలోకి చేరి ఫిరాయించిన వారిపై తీసుకుంటున్న చర్యలపై నాలుగు వారాల్లో నివేదిక ఇవ్వాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం పట్ల బాన్సువాడ నియోజకవర్గంలో చర్చనీయాం శంగా మారింది. రాష్ట్రంలో వివిధ నియోజక వర్గంలో బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేలుగా గెలిచి తరువాత కాంగ్రెస్‌లో చేరిన వారిపై అనర్హత వేటు పడితే ఉప ఎన్నికలు జరిగే అవకాశముందని జోరుగా వినిపి స్తుంది. హైకోర్టు.. స్పీకర్‌కు ఆదేశించిన నేపథ్యంలో బాన్సువాడ నియోజక వర్గంలో రాజకీయాలు వేడెక్కాయి.

బీఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేసి ముచ్చటగా మూడోసారి పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొందిన విషయం విధితమే. రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో నియోజకర్గ అభివృద్ధే లక్ష్యంగా మాజీ స్పీకర్ కాంగ్రెస్‌లో చేరిన విషయం విధితమే. సీనియర్ నాయకులైన పోచారం సేవలు వినియోగించుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఆయనకు రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారుగా క్యాబినేట్ హోదాను కట్టబెట్టింది. ఈ నేపథ్యంలో సోమవారం హైకోర్టు తీర్పు వెలువడటంతో బాన్సువాడ నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఇంతకు బాన్సువాడలో ఉప ఎన్నికలు జరుగుతాయా అనే చర్చలు చోటు చేసుకుంటున్నాయి. పార్టీ ఫిరాయింపు పై సీనియర్ నాయకులు కొందరు మాట్లాడుతూ హైకోర్టు తీర్పును పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు హైకోర్టు డివిజన్ బెంచ్‌లో సవాల్ చేసే అవకాశం ఉందని, ఒకవేళ డివిజన్ బెంచ్ సైతం సింగిల్ జడ్జీ ఇచ్చిన ఆదేశాలనే బలపరిస్తే.. ఎమ్మెల్యేలు 'సుప్రీం' తలుపు తట్టనున్నట్టు సమాచారం.

ఒకవేళ ఇదే జరిగితే ఇప్పట్లో తేలే అవకాశం లేదని చర్చలు వినిపిస్తు న్నాయి. ముందుగా ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటా రనేది రాజకీయ వర్గాలు ఆసక్తిగా మారింది. న్యాయనిపుణులను సంప్రదించిన తర్వాత తన నిర్ణయాన్ని స్పీకర్ హైకోర్టుకు తెలియజేసే అవకాశముంది. ఇదిలావుంటే బీఆర్ఎస్ నేతలు మాత్రం ఉప ఎన్నికలు తప్పవని హల్‌చల్ సృష్టిస్తుండటం గమనార్హం. అయితే పార్టీ ఫిరాయింపులపై ఇప్పటికే హైకోర్టు రెండు భిన్నమైన తీర్పులనిచ్చిన విషయం సైతం ముందుకు వస్తుంది. ఈ నేపథ్యంలో బాన్సువాడ నియోజకవర్గంలో ఉప ఎన్నికలు జరిగే అవకాశం చాలా తక్కువ అని వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గం లో ఉప ఎన్నికలు తధ్యం అంటూ బీఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రచారం చేస్తుండగా, త్వరలో ఉప ఎన్నికలు నియోజకవర్గంలో వస్తున్నా యంటూ కాంగ్రెస్ పార్టీలో ఓ వర్గం సైతం ప్రచారం చేయడం కొసమెరుపు.

అటవీ ప్రాంతంలో 12 ఎకరాల్లో చెట్లు నరికివేత

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి అటవీ రేంజ్ పరిధిలోని బొల్లారం సెక్షన్ పరిధిలోని హాజీపూర్ బీట్‌లో అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. గత వారం రోజుల నుంచి చెట్లను నరికేస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నా అటవీశాఖ అధికారులకు తెలిసినప్పటికీ పట్టించుకోవటం లేదని తండవాసులు, స్థానికులు ఆరోపిస్తున్నారు. అడవిని నరికిన అక్రమణదారులు ఎంత పెద్ద వారైనా వదిలి పెట్టమని వారిపై కేసు నమోదు చేస్తామని ఎల్లారెడ్డి ఫారెస్ట్ రేంజ్ అధికారి ఓంకార్ నాయక్ అన్నారు. మంగళవారం పరిశీలించారు.

అయితే అధికారుల క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ ఉన్నప్పటికీ కూడా ఇదంతా ఎందుకు జరుగుతుందో బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అని పలువురు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత బీట్ అధికారి హస్తంతోనే ఆటవి ప్రాంతాన్ని నరికి వేస్తున్నారని, స్థానికులు తండవాసులు ఆరోపిస్తున్నారు.

అపశృతులకు తావివ్వొద్దు

- ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనోత్సవం చేపట్టాలి
- అధికారులతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి సమీక్ష
- శోభాయాత్ర మార్గాన్ని పరిశీలించిన కలెక్టర్, సీపీ

నవతెలంగాణ-కంఠేశ్వర్/నవీపేట్





ప్రశాంత వాతావరణంలో ఆనందోత్సాహాల నడుమ గణేష్ నిమజ్జనోత్సవం జరిగేలా చర్యలు చేపట్టాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అధికారులకు సూచించారు. పోలీస్ కమిషనరేట్ లో ఎమ్మెల్యే కలెక్టర్, సీ.పీ, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ లతో కలిసి సంబంధిత అధికారులతో వినాయనక నిమజ్జనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష చేపట్టారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, అధికారులకు పలు సూచనలు చేశారు. ఎలాంటి అపశ్రుతులు తావులేకుండా ఆనందోత్సాహాల నడుమ భక్తి శ్రద్ధలతో నిమజ్జనోత్సవం జరుపుకోవాలని ప్రజలను కోరారు. ఎలాంటి వదంతులను నమ్మవద్దని, పరస్పర సహకారంతో గణేష్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ వేడుకలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని అన్నారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలన్నారు. ఈ వేడుకల సందర్భంగా ఎవరైనా అల్లర్లు సృష్టించేందుకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేందుకు ప్రయత్నించే వారి పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పోలీసు అధికారులకు సూచించారు.

ఈ మేరకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, శోభాయాత్ర కొనసాగే మార్గాలలో సీ.సీ కెమెరా నిఘా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని సీ.పీ కల్మేశ్వర్ తెలిపారు.

క్రేన్‌లను అందుబాటులో ఉంచాలి : కలెక్టర్

కాగా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హను మంతు, సీపీ కల్మేశ్వర్ గణేశ్ శోభాయాత్ర కొనసాగే మార్గాన్ని అధికారులతో కలిసి పరిశీలిం చారు. జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతం నుండి శోభాయాత్ర ప్రారంభం కానుండగా, భారీ విగ్రహాలను నిమజ్జనం చేసే యంచ శివారులోని బాసర బ్రిడ్జి వరకు గల మార్గాన్ని పరిశీలించారు. రోడ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. రోడ్లకు ఇరువైపులా అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలను పైకి భిగించాలని సూచించారు. జానకంపేట్ రైల్వే క్రాసింగ్ మీదుగా ఎనిమిది అడుగులకు పైబడి ఎత్తు కలిగిన విగ్రహాలను తరలించే వీలు లేకపోవడంతో ప్రత్యామ్నాయ మార్గంగా నందిపేట మండలంలోని ఉమ్మెడ గోదావరి పరీవాహక ప్రాంతాన్ని పరిశీలించారు. భారీ విగ్రహాల నిమజ్జనం కోసం క్రేన్లను అందుబాటులో ఉంచాలని, తగిన లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిమజ్జనోత్సవంలో ఏ చిన్న ప్రమాదానికి కూడా ఆస్కారం లేకుండా ముందు జాగ్రత్త చర్యలన్నీ చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ ఎం.మకరంద్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, మున్సిపల్, ఆర్ అండ్ బీ, తదితర శాఖల అధికారులు ఉన్నారు.

నిరంతర వెలుగు



నవతెలంగాణ-మోర్తాడ్

మండల కేంద్రంలోని జ్యోతిరావుపూలే పాఠశాల సమీపంలో గత వారం రోజుల నుండి వీధి దీపాలు నిరంతరం వెలుగుతూనే ఉంటున్నాయి. సాయంత్రం పూట వీధిదీపాలను వెలిగించి ఉదయం పూట వాటిని ఆపేయాల్సిన వారు లేకపోవడంతో ఆ కాలనీ సమీపంలో వీధి దీపాలు వెలుగుతూనే ఉన్నాయి. ఆ కాలనీ సమీపంలో ఓ ఫంక్షన్ హాల్‌కు కూడా వీధి దీపాల కనెక్షన్ ఏర్పాటు చేయడంతో ఆ ఫంక్షన్ హాల్‌కు కూడా పూర్తిగా విద్యుత్ సౌకర్యం ఉచితంగానే ఉంటుందని తెలిపారు. వారం రోజులుగా వీధి దీపాలను వెలుగుతున్నప్పటికీ స్థానిక గ్రామపంచాయతీ సిబ్బంది వాటి వైపు చూడకపోవడంతో పంచాయతీపై విద్యుత్ భారం ఏర్పడనుంది. రహదారి పక్కనే ఉన్న పాఠశాలకు వీధి దీపాలు వెలుగుతున్నప్పటికీ రహదారి పంట వెళ్తున్న సిబ్బంది వాటిని చూసి తొలగించాల్సిన ఉన్నప్పటికీ వాటి వైపు చూడకపోవడంతో నిరంతర విద్యుత్ దీపాలు వెలుగుతూనే ఉన్నాయి.

విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేత



విద్యార్థులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న సుంకం భూషణ్

నవతెలంగాణ-ఆర్మూర్

మండలంలోని పిప్రి గ్రామానికి చెందిన సుంకం భూషణ్ ప్రతి నెల ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలల పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నట్టు ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, విశ్వనాథ్ మంగళవారం తెలిపారు. నేటి బాలలే రేపటి భావి భరత పౌరులని, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని దాత సుంకం భూషణ్ అన్నారు. వారి ఉదార స్వభావానికి ఇరు పాఠశాలల తరఫున ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం ధన్యవాదాలు తెలిపారు.

పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అంకిత్

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

గ్రామాల్లో పారిశుధ్య పనుల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అంకిత్ పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ఎంపీడీవో సంతోష్ కుమార్ తో కలిసి మండలంలోని పూరాని పేట్, సుదర్శన్ నగర్ తండా, సంతోష్ నగర్ తండా గ్రామ పంచాయతీ కార్యాలయాలను ఆకస్మికంగా ఎల్ఆర్ఎస్, జీపీ ఓటర్ల తయారీ పనులను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. ఆయా పంచాయితీల పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనుల నిర్వహణ కోసం, వెచ్చిందని నిధుల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో పచ్చదనానికి అధిక ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పారిశుధ్య పనుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సంతోష్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ విష్ణువర్ధన్, గ్రామ సెక్రెటరీలు రజిత, ఉపది సిబ్బంది తదితరుల పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యం



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు రైలులో నుంచి దిగి అదృశ్యమైనట్లు నిజామాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయి రెడ్డి మంగళవారం తెలిపారు. ఈనెల 8నవెస్ట్ గోదావరి భీమవరం రైల్వే స్టేషన్ నుండి కృష్ణమూర్తి (72) తన భార్య ఇతరులు కలసి శిరిడీ వెళ్లం అని నాగర్ సోల్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో బయల్దేరారు. నిజామాబాద్ వచ్చే సరికి ఈనెల 9న అర్ధరాత్రి అందరు పడుకోగా కృష్ణమూర్తి ట్రైన్ దిగి బయటకు వచ్చాడు. ఆయన భార్య బాసర్‌లో చూసే సరికి తన భర్త కనిపించ లేదని వెంటనే తన కుమారుడికి తెలిపింది. ఆయన సోమవారం రాత్రి నిజామాబాద్ చేరుకొని నిజామాబాద్ రైల్వే పోలీసులను ఆశ్రయించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అదృశ్య కేసును నమోదు చేశారు. అనంతరం రెండు స్పెషల్ పార్టీలను నియమించి అన్ని ఏరియాల్లో సీసీ కెమెరా లు చెక్ చేయగా చివరగా ఎల్లమ్మ గుట్ట కామన్ నుండి లోపలికి వెళ్లినట్టుగా కనిపించాడని రైల్వే పోలీసులు తెలిపారు. ఎల్లమ్మ గుట్ట వాసులు, నిజామాబాద్ వాసులకు అదృశ్యమైన వ్యక్తి ఎక్కడైన కనిపిస్తే వెంటనే సాయిరెడ్డి ఎస్ఐ రైల్వే నిజామాబాద్ 8712658591 నెంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు.

ముప్పగంగారెడ్డిపై ఎమ్మెల్యేకు ఫిర్యాదు



మాట్లాడుతున్న కాలనీ వాసులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

కాంగ్రెస్ పార్టీకి చెందిన కిసాన్ కాంగ్రెస్ నాయకుడు ముప్ప గంగారెడ్డి పార్కు స్థలాన్ని కబ్జా చేస్తున్నాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని వినాయక్ నగర్ భవానీనగర్ కాలనీవాసులు నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని మంగళవారం కలిసి ఫిర్యాదు చేశారు. చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయనను కాలనీవాసులు కలిసి ఫిర్యాదుపత్రాన్ని అందజేశారు. ముప్ప గంగారెడ్డి పై చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ స్థలానిన కాపాడాలని కోరారు. కార్యక్రమంలో వినాయక్ నగర్ భవాని నగర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

దేశస్థాయి సైనిక పాఠశాలకు బాలుడు ఎంపిక



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన శ్రీ సాయి వంశవర్ధన్ విడతల వారీగా విడుదల చేయబడిన ఫలితాల్లో దేశ స్థాయి సైనిక స్కూల్ అంబికాపూర్ ఛత్తీస్ ఘడ్ పాఠశాలలో సీటు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థిని పట్టణంలోని డ్రీమ్జ్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎండి. అజ్మత్, ఉపాధ్యాయ బృందం మంగళవారం అభినందించారు.

విద్యార్థుల్లో సామర్థ్యాల గుర్తింపు పరీక్ష

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో విద్యా ప్రగతి అంశాల పరిశీలనకు చేపట్టిన నేషనల్ అచీవ్మెంట్ సర్వే (నాస్)కు సంబంధించిన ప్రారంభ పరీక్షను మంగళవారం నిర్వహించారు. ప్రత్యేకంగా మూడు, ఆరు, తొమ్మిది తరగతుల విద్యార్థులలో సామర్థ్యాలను గుర్తించడానికి ఈ పరీక్షను విద్యాశాఖ ఆధ్వర్యంలో నవంబర్‌లో నిర్వహించనున్నారు. మంచి ఫలితాలను తీసుకురావడానికి గాను జిల్లాలో విద్యార్థులను సమాయత్తం చేయడానికి జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో మూడు విడతలుగా నాస్ సమాయత్త పరీక్ష నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగానే మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో 3,6,9 తరగతులకు మొదటి సమాయత్త పరీక్షను నిర్వహించారు. మండల విద్యాశాఖ అధికారి ఆంధ్రయ్య, మండల నోడల్ అధికారి గంగాధర్ లు ఆయా పాఠశాలను తనిఖీ చేసి పరీక్షల నిర్వహణను పరిశీలించారు. పరీక్ష పత్రాలను క్షుణ్ణంగా చదివిన తర్వాతే సమాధానాలను నిర్దేశిత జవాబు పత్రాల్లో పొందుపరచాలని అధికారులు విద్యార్థులకు సూచించారు. హాస కొత్తూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల నోడల్ అధికారి గంగాధర్ పరీక్షను పరిశీలించి తగు సూచనలు చేసారు . ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డిఎల్ ఎన్ చారి, ఉపాధ్యాయులు కృష్ణకుమార్, నరేందర్, శ్రీనివాసమూర్తి, ఆనంద్, జాన్ షేక్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి
- అట్టహాసంగా ఉమ్మడి మండల అంతర్ పాఠశాలల క్రీడోత్సవాలు ప్రారంభం



బాల్కొండ: మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

మండల కేంద్రంలో ఉమ్మడి బాల్కొండ (బాల్కొండ, ముప్కాల్, మెండోరా) మండల అంతర పాఠశాల క్రీడోత్సవాలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడ పోటీలలో ఉమ్మడి మండలంలోని 29 పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాజి మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, వ్యాపార వేత్త దయానంద రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజి మంత్రి ఎమ్మెల్యే వేముల మాట్లాడుతూ.. పాత ఉమ్మడి బాల్కొండ అంతర పాఠశాల క్రీడా పోటీలు రాష్ట్ర స్థాయి పోటీల లాగా గొప్పగా ప్రారంభించుకోవడం అభినందనీయం అని తెలిపారు. ఇంట్లో పండుగ లాగా ఈ క్రీడోత్సవాలను జరుపడానికి కృషి చేసిన అన్ని పాఠశాలల ఉపాధ్యాయ బృందం, పిఈటి బృందానికి అభినందనలు తెలిపారు. పి ఈ టి రాజ్ కుమార్, మల్లేష్ లాంటి క్రీడా ప్రేమికులు ఉండటం వల్లనే వారు క్రీడలు గొప్పగా నిర్వహిస్తున్నారని అన్నారు. క్రీడలు సజీవంగా ఉండటానికి వారి కృషి అభినందనీయం అని తెలిపారు. గ్రామీణ స్థాయి నుండి క్రీడల్లో రాణించి రాష్ట్ర దేశ స్థాయిలో ఆడిన వాళ్ళు ఉన్నారని, వారిని మీరంత స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు. నా బాల్యం చదువు మొత్తం ప్రభుత్వ పాఠశాల లోనే సాగిందని, ఉమ్మడి మండలంతో అవినాభావ సంబంధం ఉందని, ఇక్కడే కిసాన్ నగర్ లో 10 వ తరగతి విద్యాభ్యాసం సాగిందని తెలిపారు. ప్రముఖ వ్యాపారవేత్త దయానంద రెడ్డి దాతృత్వానికి అవధులు లేవని, ఆయన జిల్లా వ్యాప్తంగా ముఖ్యంగా బాల్కొండ నియోజకవర్గంలో పాఠశాల కు అవసరమైన డెస్క్ బెంచ్ లు,స్పోర్ట్స్ డ్రెస్లు, స్పోర్ట్స్ మెటీరియల్, కంప్యూటర్ ఇస్తూనే ఉన్నారని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 60 లక్షల రూపాయలకు పైగా పాఠశాలలో కావాల్సిన అవసరాలు తీర్చారని కొనియాడారు. క్రీడలు అనేవి కేవలం ఫిట్ నెస్ కోసమే కాదు.. జీవితంలో మనకు ఎదురు దెబ్బలు తగిలినపుడు వాటిని తట్టుకొని నిబ్బరంగా మనో ధైర్యంగా ఉండటానికి ఉపయోగపడతాయని అన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజం.. అన్నింటిని సమానంగా తీసుకోవాలని, అప్పుడే స్పోర్టింగ్ స్పిరిట్ విద్యార్థుల్లో అలవడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను చదువుల్లోనే కాకుండా క్రీడల్లో కూడా ప్రోత్సహించాలి అని అన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉమ్మడి మండల పరిధిలోని పాఠశాలల విద్యార్థులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మార్చ్‌ఫాస్ట్‌లో ద్వితీయ బహుమతి సాధించిన కేటీఎస్

ఉమ్మడి మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీలలో మండల కేంద్రంలోని కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు తమ సత్తా చాటారు. మొదటిరోజు జరిగిన మార్చ్‌ఫాస్ట్ పోటీలలో ద్వితీయ బహుమతి సాధించినట్లు కృష్ణవేణి స్కూల్ ప్రిన్సిపాల్ విజయ్ కార్తన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

మార్చ్ ఫాస్ట్ లో ప్రతిభ

ముప్కాల్: ఉమ్మడి బాల్కొండ మండల కేంద్రంలో జరుగుతున్న 68వ ఎస్జీఎఫ్ అంతర్ పాఠశాలాల క్రీడోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా మార్చ్ ఫాస్ట్‌లో ముప్కాల్ మండల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా మార్చ్ ఫాస్ట్ లో మొదటి బహుమతిగా కేజీబీవీ ముప్కాల్, ద్వితీయ స్థానంలో జడ్పీహెచ్ఎస్ ముప్కాల్, యూపీఎస్ లెవల్‌లో ప్రథమ స్థానంలో న్యూ హరిజోన్స్-ముప్కాల్, మండలంలోని రెంజర్ల విజ్ఞాన్ పాఠశాల ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు పోటీల నిర్వాహకులు తెలిపారు. ముప్కాల్ మండలంలోని పలు పాఠశాలలు మార్చ్ ఫాస్ట్‌లో ఫలితాలను సాధించడంతో పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేశారు.



బాల్కొండ: మార్చ్‌ఫాస్ట్‌లో ద్వితీయ బహుతి సాధించిన కృష్ణవేణి స్కూల్ విద్యార్థులు



ముప్కాల్ : మార్చ్‌ఫాస్‌లో ప్రతిభ చాటిన విద్యార్థులు

అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని అందించేది గురువులు

- మండల విద్యాధికారి ఎన్. ఆంధ్రయ్య
- చౌట్‌పల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన వీడీసీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

పాఠశాలకు వచ్చే విద్యార్థుల్లోని అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్ని అందించేది గురువులని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఆంధ్రయ్య అన్నారు. మండలంలోని చౌట్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి ఎన్. ఆంధ్రయ్య మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలకు జన్మనిస్తే గురువులు జీవితాన్ని ఇస్తారన్నారు. చీకటిని ప్రారదోలి వెలుతురును ప్రసాదించేది, అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్ని అందించేది గురువులన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి చాలా గౌరవం ఉంటుందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కమల మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తిచాలా పవిత్రమైనదని అన్నారు. విద్యార్థులను భావి భారత పౌరులుగా తీర్చిదిద్దే గురుతర బాధ్యత కూడా ఉపాధ్యాయులపైన ఉందన్నారు. విద్యార్థులు తమ జీవితంలో ఉపాధ్యాయులను గుర్తుంచుకునే విధంగా విద్య బోధన చేయాలని కోరారు. అనంతరం పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి ఆంధ్రయ్య, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులను, బోధనేతర సిబ్బందిని శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కమల, సభ్యులు దేవిక, కవిత, ఎస్. విజయ, ఎండి మునీర్, ఆర్. గణేష్, సాయి ప్రసాద్, వి. గణేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాకు చెందిన శాస్త్రవేత చారికి యూరో ఏషియన్ యూనివర్సిటీ డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న నర్సింహచారి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాకు చెందిన శాస్త్రవేత్త, తన ప్రయోగాలకు ప్రపంచస్థాయిలో పేటెంట్ పొందిన మండాజి నర్సింహచారి యూరో ఏషియన్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. గతనెల 31న దేశ ఆర్థికరాజధాని ముంబైలో యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి చారిని ముఖ్యఅతిథిగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రపంచ పేటెంట్ ద్వారా చారి సాధించిన అద్భుతాన్ని ప్రపంచంలో ఎవరూ సాధించలేదని తెలిపారు. దీని ముఖ్య ఉద్దేశమే ఆయనకు గౌరవ డాక్టరేట్ అందజేయడమని పేర్కొన్నారు. చారి వరల్డ్ పేటెంట్ సాధించిన ప్రయోగం ప్రపంచస్థాయిలో చాలా మందిని వ్యాధుల నుంచి కాపాడుతోందన్నారు. ఈ రోజుల్లో గుండెపోటు ముప్పు ఉన్న వారి ప్రాణాలను చారి ప్రయోగం కాపాడుతోందని కొనియాడారు. అలాగే వ్యవసాయరంగంలో చారిచేసిన ప్రయోగాలు అద్భుతమని, ఆయన ప్రయోగాలు రైతలకు ప్రయోజనం చేకూర్చడంతోపాటు పంట దిగుబడులను పెంచుతున్నాయని అభినందించారు. ఐరోపా దేశంలో చారికి మంజూరైన పేటెంట్, డిస్కవరీ, టీఎల్‌సీ, బీబీసీ టీవీల్లో చారి ఇంటర్వ్యూలను తాము గమనించామని యూరో ఏషియన్ యూనివర్సిటీ ప్రతినిధులు తెలిపారు.

జిజి కాలేజీలో బ్యాక్‌లాగ్ ప్రాక్టికల్స్ ఎగ్జామ్స్‌ను మళ్లీ నిర్వహించాలి

- పీడీఎస్‌యూ



వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పిడిఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిజి కాలేజ్ కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్ భారత్ రాజ్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. జిజి కళాశాలలో డిగ్రీ విద్యార్థులు గత సంవత్సరం 5వ, 6వ సెమిస్టర్ విద్యార్థులు కొంతమంది ప్రాక్టికల్స్ రాకపోవడం వల్ల రికార్ట్స్ సబ్మిట్ చేయకపోవడం వల్ల మెమోలలో ఫెయిల్ చూయిస్తున్నాయని , విద్యార్థులు పై చదువులు పీజీ మరియు ఇతర ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లలో ఉత్తీర్ణులయ్యారు. కానీ కళాశాలలో ప్రాక్టికల్స్ రాయనందువల్ల రికార్డ్స్ సబ్మిట్ చేయకపోవడం వల్ల వారి మెమోలలో ఫెయిల్ అని పడిందన్నారు. కావున ఎవరైతే ప్రాక్టికల్స్ రికార్డు సబ్మిట్ చేయని విద్యార్థులు ఉన్నారో, వారి భవిష్యత్తుపై చదువుల రిత్యా విద్యార్థులకు మళ్లీ ఒక అవకాశం కల్పించి వారికి ప్రాక్టికల్స్ పరీక్షలు మళ్ళీ నిర్వహించాలని, బ్యాక్ లాక్ ఎగ్జామ్స్ నిర్వహించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో పిడిఎస్యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్, కార్యదర్శి ప్రిన్స్, నాయకులు దేవిక, వంశీ, మనోజ్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

తాగుడుకు బానిసై వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని యానం గుట్ట సమీపంలో మహారాష్ట్రకు చెందిన బాలు ప్రకాష్ బోదిలే (40)సంవత్సరాలు చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డ సంఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు సంవత్సరాల క్రితం ఈయన బతుకుతెరువు కోసం పట్టణానికి వచ్చి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని నెలలుగా భార్య పిల్లలకు దూరంగా ఉండడంతో మద్యానికి బానిసై ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లి జయబాయి ఫిర్యాదు మేరకు ఏఎస్ఐ లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కాగా మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పట్టణ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఉమ్మడి జిల్లా సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ సెలక్షన్స్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 12 న నవ్య భారతి గ్లోబల్ స్కూల్ విశాఖ నగర్, పెర్కిట్ ఆర్మూర్ నందు నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్స్ సెలక్షన్స్ ని నిర్వహిస్తతారని నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రక్రియలో ఎంపికైన క్రీడాకారులు ఈనెల 14, 15, జెఎన్ స్టేడియం హనుమకొండలో జరగబోయే 38వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాయ్స్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొనడం జరుగుతుంది. ఈ ఎంపిక ప్రక్రియలో పాల్గొనే క్రీడాకారులు తేది 01-01-2009 నుండి 01-01-2011 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. తమ జనన ధ్రువీకరణ పత్రంతో ఈనెల 12న ఉదయం 11 గంటలకు నవ్య భారతి గ్లోబల్ స్కూల్ విశాఖ నగర్, పెర్కిట్,ఆర్మూర్ నందు నిజామాబాద్ జిల్లా హ్యాండ్బల్ సంఘం కోశాధికారి గట్టడి రాజే ష్ కు, వ్యాయామ ఉపాధ్యాయుడు కొండ్ర అంజుకు రిపోర్ట్ చేయాలని తెలిపారు.

రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేయాలి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాలో రక్తం కొరత ఉందని రెడ్ క్రాస్ సొసైటీ నిజామాబాద్ జిల్లా చైర్మన్ ఆంజనేయులు అన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ..గణేష్ మండపాల వద్ద అన్నదానాలతో పాటు స్వచ్ఛందంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కోరారు. రక్తదానం చేయడం ద్వారా తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులు, డెంగీ బారిన పడిన వారి ప్రాణాలను కాపాడవచ్చని తెలియజేశారు. రక్తదాన శిబిరాలు నిర్వహించేలా రెడ్ క్రాస్ సభ్యులు సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలియజేశారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి శిక్షణ ప్రారంభం కానున్నట్టు సంస్థ డైరెక్టర్ సుంకం శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పురుషులకు సీసీటీవీ ఇన్స్టాలేషన్ (13 రోజులు), సెల్ఫోన్ రిపేర్ (30 రోజులు), ఏసి రిపేర్ (30 రోజులు) ఉంటుందని పేర్కొన్నారు. 19 నుండి 45 సంవత్సరాలు కలిగిన నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల గ్రామీణ ప్రాంత యువకులు ధృవీకరణ పత్రాలు, ఆధార్ కార్డు , రేషన్ కార్డ్, ఎస్ఎస్‌సీ సర్టిఫికెట్, ఐదు ఫొటోలు తీసుకొని వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. శిక్షణా సమయంలో భోజనం, హాస్టల్, శిక్షణ పూర్తిగా ఉచితంగా అందచేస్తున్నామని పేర్కొన్నారు. శిక్షణా అనంతరం ధృవీకరణ పత్రం, టూల్ కిట్ కూడా అందచేస్తున్నట్టు తెలిపారు. శిక్షణా కేంద్రం డిచ్‌పల్లి మండల కేంద్రంలోని టీటీడీసీ క్యాంపస్, వెలుగు ఆఫీస్ పక్కన ఉందని తెలియజేశారు. ఆసక్తిగలవారు 08461-295428. సంప్రదించాలని తెలియజేశారు

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ఇద్దరికి నిజామాబాద్ జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ వీరయ్య మంగళవారం తెలిపారు. నగరంలో డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనాల తనిఖీలు నిర్వహించగా మద్యం సేవించి వాహనం నడిపిన బోర్గం కు చెందిన చామకూర లక్పతి (43) ఇప్పటివరకు నాలుగు సార్లు పట్టుబడినట్లు తెలిపారు. అలాగే నగరంలోని ఆదర్శనగరకు చెందిన రావుల మహేష్ (32) కూడా నాలుగు సార్లు పట్టుబడినట్లు తెలిపారు. అయితే ఈ ఇద్దరినీ అదుపులోకి తీసుకొని జిల్లా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ హైమద్ మోహినిద్దీన్ ముందు హాజరు పర్చారు. విచారణ అనంతరం ఇద్దరికి రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ సిఐ వీరయ్య తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడపకూడదని వాహనదారులు జాగ్రత్తలు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని కోరారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

- ప్లాట్‌ను కాజేశారని మనస్థాపంతో..

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని 5వ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని నమ్మించి తన ప్లాట్‌ను కాజేయడంతో తీవ్ర మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మ హత్య చేసుకున్నట్లు ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. నాగారం లోనీ 80 క్వార్టర్స్ లోని నాగరాజు ఆయన భార్య మాధవి తాలూకు పెద్దమ్మకు సంతానం లేరు. ఆమెకు చెందిన భూమిని నాగరాజు గౌడ్(54) భార్య మాధవి కి ఇవ్వడానికి సిద్ధం అయింది. మాధవి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ మేరకు ఆ భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేయించాలని నాగారంకు చెందిన మల్లేష్ ను కోరాడు. స్నేహితుడే కావడంతో గుడ్డిగా నమ్మాడు. కానీ మల్లేష్ ఆ భూమి ని మాధవి పేరు మీద కాకుండా ఇతర వ్యక్తుల పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారు. విషయం తెలిసి నాగరాజు గౌడ్ పది రోజుల క్రితం రూరల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. కానీ మల్లేష్ అక్కడి పోలీసులను మేనేజ్ చేయడంతో మనస్థాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మ హత్య చేసుకున్నట్లు తెలిపారు. భార్య మాధవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గంగాధర్ తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
బుధవారం | సెప్టెంబర్ 11, 2024 | www.navatelangana.com

మురికి కాలువ నిర్మాణ పనులు పరిశీలన

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని కాటేపల్లి తాండ గ్రామ పంచాయతీలో మురికి కాలువ నిర్మాణ పనులను ఎంపీడీఓ లక్ష్మీకాంత్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2022-2023 ఎంపీపీ నిధుల ద్వారా రూ.2 లక్షలు మంజూరు ఉండటంతో సుమారు 80 మీటర్ల పొడవు మురికి కాలువ నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. నిర్మాణ పనులను నాణ్యతగా నిర్మించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి, తాండ ప్రజలు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

అచ్చాయిపల్లిలో పారిశుధ్య పనులు పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని అచ్చాయిపల్లి గ్రామంలో పారిశుధ్య పనులను ఎంపీడీవో ప్రభాకర్‌చారి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా గ్రామపంచాయతీ రికార్డులను ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ప్రభాకర్ చారి

ఐలమ్మ సేవలు మరువలేనివి



ఎడపల్లి : చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు



లింగంపేట్‌లో..



దోమకొండలో..

- వర్థంతి సందర్భంగా నివాళి

నవతెలంగాణ-విలేకరుల బృందం

మద్నూర్ :చాకలి ఐలమ్మ సేవలు మరువలేనివని.. ఆమె పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని రజక సంఘం మండలాధ్యక్షులు ఇందూర్‌వార్ దేవిదాస్ అన్నారు. చాకలి ఐలమ్మ 39వ వర్థంతి వేడుకలను మండల కేంద్రంలోని రజక గల్లీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రజక సంఘం అధ్యక్షులు మాట్లాడారు చాకలి ఐలమ్మ భూమి ముక్తి కోసం పోరాడారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణ, విఠల్, సంగ్రామ్, రాజు, హన్మండ్లు, దత్తు, లింగురాం, మోహన్, నాగేష్, ఐ.సాయిలు, గంగాధర్, రాములు, శంకర్, బి.సాయిలు, హనుమాన్లు, మొగ్లాజి తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, మాజీ జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్ నాయకులు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. తెలంగాణలో భూమి కోసం, భుక్తి కోసం, విముక్తి కోసం జ్వలించిన నిప్పుకణిక అని అన్నారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన వీరమాత అని కీర్తించారు. తెలంగాణ తెగువకు చిరునామాగా నిలిచిన వీర వనిత అని, మహిళా లోకానికి స్ఫూర్తి ప్రదాత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నర్సరెడ్డి, స్వామి, మధు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతిని మండలంలోని ఆయా గ్రామాలలో పార్టీలకు అతీతంగా నిర్వహించారు. మండలంలోని శెట్పల్లి సంగారెడ్డి, మోతే, భవానీపేట్, ఐలాపూర్, బాణాపూర్, లింగంపల్లి గ్రామాలతో పాటు ప్రభుత్వ కార్యాలయంలో అధికారులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శెట్పల్లి సంగారెడ్డి గ్రామంలో గాంధీ విగ్రహం వద్ద ఐలమ్మ చిత్రపటానికి రజకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేష్, ఎమ్మార్వో నరేందర్, రజక సంఘం గ్రామ అధ్యక్షులు సంగ్యపు సాయిలు, కోశాధికారి మల్లేష్, ఉపాధ్యక్షులు అశోక్, గ్రామ పంచాయతీ సెక్రటరీ సంతోష్ కుమార్, బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమేష్, నాయకులు మొహిద్, అంజయ్య, శ్రీనివాస్‌రెడ్డి, భూమ్‌రెడ్డి, విష్ణు, రాజేశ్వర్, రాంచందర్, మనోజ్, కిరణ్‌రెడ్డి, పాపయ్య, యాదగిరి, సాయిలు, సాయిబాబు, రాజయ్య, నారాయణ, దుర్గాప్రసాద్, బాబు, సంతోష్, దశరథ్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

బోధన్ : పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 39వ వర్దంతిని సాలూర, బోధన్ మండలాల్లో రజక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సాలూరా మండల కేంద్రంలోని గిద్ద చెరువు వద్ద చాకలి ఐలమ్మ విగ్రహానికి రజక సంఘం సభ్యులు, గ్రామ పెద్దలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం భూమి, భుక్తి, విముక్తి కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటాలను వక్తలు కొనియాడారు. ఆమె స్ఫూర్తితో మహిళలు అన్యాయంపై తిరగబడాలన్నారు. కార్యక్రమంలో రజకసంఘం అధ్యక్షులు లక్ష్మణ్, పీఆర్టియూ జిల్లా నాయకులు ఇల్తెపు శంకర్, వెంకట్ పటేల్, సురేష్, సింగడి పాండు, నర్సింలు, రాజాగౌడ్, సంతోష్, రాములు, అశోక్, సొసైటీ చైర్మెన్ జనార్దన్, లైబ్రరీ చైర్మెన్ స్వామిగౌడ్, లైబ్రరీ కార్యదర్శి లింబూరి లక్ష్మణ్ గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎడపల్లి : మండల కేంద్రంలో చాకలి ఐలమ్మ వర్ధంతిని రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడారు.. అన్యాయాన్ని నిలదీసిన వీరనారి చాకలి ఐలమ్మ అని కొనియాడారు. నేటి యువత ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రజక వృత్తిదారులతో కూడా ఆనాటి దొరలు వెట్టిచాకిరీ చేయించుకునే వారని, ఆ వ్యక్తితో తగిన గౌరవం లేకపోవడంతో రజకులు సమాజంలో గౌరవంగా బతికే విధంగా పోరాటం చేసిన వీరనారి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కే శ్రీనివాస్, మాజీ సర్పంచ్‌లు శంకర్ నాయుడు, ఎల్లయ్య యాదవ్, మాజీ ఉపసర్పంచ్ ఆకుల శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, రజక సంఘం మండల అధ్యక్షులు దేగాం ముత్యం, ప్రధాన కార్యదర్శి మల్లెపూల శ్రీనివాస్, రజక సంఘం నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్‌లో..

వరికి తెగుళ్లు.. నివారణకు సూచనలు



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్

నవతెలంగాణ-నిజాంసాగర్

మహమ్మద్‌నగర్ మండలంలోని గున్కుల్ గ్రామంలో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి అమర్ ప్రసాద్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు వరి పంటలో కాండం తొలుచు పురుగు, పొట్ట కుళ్ల తెగులు, బ్యాక్టీరియా ఎండాకు తెగుళ్ల ఉధృతంగా వ్యాప్తి చెందడం గమనించినట్టు ఆయన తెలిపారు. ఈ చీడలు, తెగుళ్లను అరికట్టడానికి రైతులకు పలు సూచనలు చేసినట్టు వివరించారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ ఎకరానికి 400 గ్రాములు లేదా క్లొరాంట్రానిలిప్రోల్ ఎకరానికి 60 మి.లీ. పిచికారీ చేయాలని, పొట్ట కుళ్ల తెగులు నివారణకు ప్రొపికొనజోల్ ఎకరానికి 200 గ్రాములు పిచికారీ చేయాలని పేర్కొన్నారు. బ్యాక్టీరియా ఎండాకు తెగులు నివారణకు స్ట్రెప్టోమైసిన్ సల్ఫేట్ మందును ఎకరానికి 50 గ్రాములు పిచికారీ చేయాలని రైతులకు సూచించినట్టు తెలిపారు. వరి పంటలో చీడపీడలు, తెగుళ్ల వ్యాప్తి కనపడినప్పుడు యూరియా వాడకాన్ని తగ్గించుకోవాలని, రసాయనిక ఎరువులు వాడొద్దని రైతులకు సూచించారు. ఈ క్షేత్ర సందర్శనలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలన

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో అధిక వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను వ్యవసాయ విస్తీర్ణ అధికారులు మంగళవారం పరిశీలించారు. అధిక వర్షాల వల్ల పత్తి పంట నీరు పట్టడంతో రైతులకు పలు సూచనలు చేశారు. రైతులకు కాపర్ ఆక్సిక్లోరైడ్, మైక్రో న్యూట్రియంట్స్ మొక్క మొదల్లు తడిసేలా పిచికారీ చేయవలసిందిగా సూచించారు. విస్తీర్ణ అధికారులు ధర్మారావుపేట శ్రీనివాస్, బానోత్, సదాశివనగర్ కవిత, పద్మాజివాడి శ్రీలక్ష్మీ, లింగంపల్లి ఆకుల గాయత్రి, ఉత్నూర్ ఏఈఓలు పాల్గొన్నారు. రైతులు గంగాధర్, లింగం, సాయిలు, శ్రీనివాస్, చిన్న నర్సింలు, నాగేశ్వర్‌రావు, శివాజీరావు, వెంకటి, కిషన్, రాజు, పెద్ద బీర చందర్‌రావు తదితర రైతుల పంటలను పరిశీలించి రైతులకు మంచి సూచనలు చేశారు.



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-సదాశివనగర్

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల (మర్కల్) కామారెడ్డి నందు ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్ట్‌లకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.శోభారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో కామర్స్, ఎకనామిక్స్, బోటనీ, తెలుగు, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుల్లో ఒక్కొక్క పోస్ట్ ఖాళీగా ఉందని, ఆసక్తి, అర్హత కలిగిన మహిళా 12-09-2024 గురువారం ఉదయం 10గంటలకు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో వచ్చి, డెమో, ఇంటర్వ్యూకు హాజరు కావల్సిందిగా ఆమె సూచించారు.

వినాయకుడి వద్ద ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో సుభాష్ చంద్రబోస్ కాలనీలో ప్రతిష్ఠించిన వినాయకుడి వద్ద సోమవారం రాత్రి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రులు ముగిసే వరకూ వినాయక విగ్రహం వద్ద ప్రతిరోజు ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కాలనీవాసులు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని మెల్ల కుంట తండాలో మంగళవారం ఎంపీడీవో ప్రభాకర్ చారి పోలింగ్ బూతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా గ్రామాలలో పోలింగ్ నిర్వహించడానికి కావలసిన సదుపాయాలు ఉన్నాయా లేవా అని గ్రామాలలో పోలింగ్ బూతులను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రమైన రెంజల్ గ్రామానికి చెందిన నిరుపేదలకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేసినట్టు మాజీ సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ పేర్కొన్నారు. నిరుపేదలైన నాలుగు కుటుంబాల వారికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్‌రెడ్డి సహాయ సహకారాలతో నిరుపేదలకు ఈ చెక్కులను పంపిణీ చేసినట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులతో పాటు స్థానిక నాయకులు సాయిబాబాగౌడ్, ఇందిరా దేవి, డైరెక్టర్ కురుమే శ్రీనివాస్, అనిల్, సాయాగౌడ్, సగ్గు వెంకటి, షబ్బీర్, రవి, సల్మాన్ ఖాన్, సాయిలు, శివ, సమ్మి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న దృశ్యం

రైతులు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి

నవతెలంగాణ-పిట్లం

పంటలపై శాస్త్రవేత్తలు సూచించిన సలహాలను రైతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారిని కమల అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని తిమ్మానగర్ రైతు వేదికలో వ్యవసాయ పంటలపై వీడియో కాన్ఫరెన్స్‌లో శాస్త్రవేత్తలు పంటలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారిని మాట్లాడుతూ.. ప్రస్తుత తరుణంలో వరి పంటలో ఆకు రెండు తెగులు, అగ్గి తెగులు సోకినట్లు శాస్త్రవేత్తలు నిర్దేశించిన సలహాలు సూచనలను రైతులు తప్పకుండా పాటించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో తిమ్మానగర్ క్లస్టర్ ఏఈఓ లావణ్య, గ్రామపెద్దలు రైతులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రైతులు

నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భాగిర్థిపల్లి గ్రామంలో వదినను చంపిన మరిది హత్య కేసులో నిందితుడు సురేష్‌ను పోలీసులు పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. మంగళవారం పట్టణ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిఐ సంపత్ కుమార్ వివరాలు వెల్లడించారు. భాగిర్థిపల్లి గ్రామంలో శుక్రవారం ఆస్తి తగాదాల విషయంలో మరిది సురేష్ వదిన లావణ్యను కత్తితో పొడిచి చంపాడు. కేసు నమోదు చేసిన పోలీసులు హంతకుడు సురేష్‌ను పట్టుకొని కేసును ఛేదించి రిమాండ్‌కు తరలించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయికుమార్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంపత్ కుమార్

భక్తిశ్రద్ధలతో పండుగలను నిర్వహించుకోవాలి

- ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-బోధన్

పండుగలను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. మంగళవారం బోధన్ పట్టణంలోని శివాలయంలో ఆయన వినాయకుడిని దర్శించుకుని మాట్లాడారు. సాంప్రదాయ బద్ధంగా వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని అన్నారు. బోధన్ పట్టణంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మంగళవారం సందర్శించారు. శక్కర్‌నగర్ రామాలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని, చక్రేశ్వర మందిరంలో సార్వజనిక్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలతో పాటు రాకాసిపేట్‌లోని భీముడిగుట్ట వినాయక మండపం వద్ద నిర్వహించిన పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు. అనంతరం గంజ్ రోడ్డులోని సాయిబాబా ఆలయంలోని వినాయక మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అత్యంత భక్తి శ్రద్ధలతో వినాయక చవితి ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు. పండుగ పర్వదినాలలో శాంతి భద్రతలకు ఎటువంటి అటంకం కలుగకుండా చూసుకోవలసిన అవసరం ప్రతి ఒక్కరిపైన ఉందని అన్నారు. కొన్ని సంఘ వ్యతిరేక శక్తులు అలజడులు సృష్టించడానికి ప్రయత్నిస్తూ ఉంటాయని వారికి అవకాశం ఇవ్వవద్దని కోరారు. ఎవరైనా సమస్య సృష్టించేందుకు చూస్తే పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సంధ్య దామోదర్‌రెడ్డి, శివాలయం కమిటీ చైర్మన్ హరికాంత్ చారి, డిసిసి డెలిగేట్ బి.గంగాశంకర్, సార్వజని ఉత్సవ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, నాయకులు ఆదినారాయణ, నాగేశ్వరరావు, గుండేటి రాములు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

మురికి కాలువలను శుభ్రం చేయాలి

- ఎంపీడీవో గంగాధర్

నవతెలంగాణ-నిజాంసాగర్

మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గంగాధర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ, మహమ్మద్‌నగర్ మండలంలోని తుంకిపల్లి గ్రామపంచాయతీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్ పనులను పర్యవేక్షించినట్టు తెలిపారు. మంచినీటి ట్యాంకులలో క్లోరినేషన్ కలిపిన నీటిని ప్రజలకు అందించాలని ఆయన పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అంటురోగాలు రాకుండా పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని ఆయన కార్యదర్శులకు ఆదేశించారు. అంగన్వాడి కేంద్రాలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు విరాళం

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలో ఏర్పాటు చేసే బుద్దె రాజేశ్వర్ విగ్రహ నిర్మాణం కోసం రజకసంఘం ఆధ్వర్యంలో రూ.10,000 విరాళాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా రజకసంఘం అధ్యక్షులు లక్ష్మణ్ మాట్లాడుతూ.. సాలూరలో చాకలి ఐలమ్మ విగ్రహ నిర్మాణం కోసం స్వర్గీయ బుద్దె రాజేశ్వర్ చేసిన కృషి మరువలేమని అన్నారు. ఆయన చేసిన మేలును మరిచిపోలేని సందర్భంగా చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహ నిర్మాణానికి 10,000/-రూపాయల విరాళం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జన స్థలాన్ని పరిశీలించిన అధికారులు



నిమజ్జన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు, స్థానిక యువకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కందకుర్తి గోదావరి ప్రధాన ఘాట్ వద్ద గణేష్ నిమజ్జన స్థలాన్ని స్థానిక ఎంపీఓ రఫీ హైమద్, ఎస్సై ఈ.సాయన్న, ఇన్చార్జి గ్రామ కార్యదర్శి భాస్కర్, కారోబార్ సాజిద్ మంగళవారం పరిశీలించారు. ఘాట్ల వద్ద మట్టి పేరుకుపోవడంతో వాటిని తొలగించడానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని వారు గ్రామపంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుపై ఏర్పడ్డ గుంతలను పూడ్చుడానికి డస్ట్‌ను తీసుకురావాలన్నారు. జిల్లాలోని నలుమూలల నుంచి నిమజ్జనానికి వచ్చే వాహనాలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ముందుగా గ్రామంలో వీధి దీపాల ఏర్పాటు ఘాట్ల వరకు వీధి దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక యువత సిరాజుద్దీన్, రాము, సురేష్, గంగాధర్, బాబు, స్థానిక యువకులు పాల్గొన్నారు.

జిల్లా మత్స్యశాఖ అధికారికి సన్మానం



జిల్లా మత్స్యశాఖ అధికారిని సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-లింగంపేట్

జిల్లా మత్స్య శాఖ అధికారి శ్రీపతికి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన మత్స్య సహకార సంఘం సభ్యులు మంగళవారం శాలువా కప్పి సన్మానించారు. జిల్లా మత్స్యశాఖ అధికారిగా పనిచేసిన వరదరెడ్డి బదిలీపై సిద్దిపేటకు వెళ్లారు. ఆయన స్థానంలో మహబూబాబాద్‌లో పనిచేసిన శ్రీపతి కామారెడ్డి జిల్లా మత్స్యశాఖ అధికారిగా రావడంతో ఆయనను తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీ అధ్యక్షులు బట్టు విట్టల్ ఆధ్వర్యంలో లింగంపేట్ మండల తెలంగాణ ముదిరాజ్ మహాసభ, మేంగారం, పోతాయిపల్లి, రామక్కపల్లి మత్స్య సహకార సంఘం అధ్యక్ష కార్యదర్శులు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో లింగంపేట మండల అధ్యక్షులు దాసరి సాయికుమార్, మెంగారం గ్రామ అధ్యక్షులు పర్వయ్య, పోతాయిపల్లి అధ్యక్షులు సంద బాలయ్య, మోహన్, వెంకటి, రామక్కపల్లి బాలయ్య, శ్రీనివాస్, రాజయ్య, కిష్టయ్య తదితరులున్నారు.

బలరామ జయంతి వేడుకలు

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఉమ్మడి మండలంలోని నూతనంగా ఏర్పడిన డోంగ్లి మండలంలోని మొగా గ్రామంలో మంగళవారం భారతీయ కిసాన్ సంఘ ఆధ్వర్యంలో బలరామ జయంతి రైతు దినోత్సవ కార్యక్రమాన్ని ఆ గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంగ్ నాయకులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి

- ట్రాన్స్‌కో ఏఈ మనోరంజన్



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

పంట పొలాల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు లో కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవడం వల్ల ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోకుండా ఉంటాయని ట్రాన్స్‌కో ఏఈ మనోరంజన్ అన్నారు. మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో మంగళవారం పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు తమ తమ పంట పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించినట్లు ఆయన తెలిపారు. పంట పొలాల వద్ద లూస్ వైరింగ్ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఈశ్వర్, ట్రాన్స్‌కో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, బెల్టులు వితరణ

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని చిన్నాపూర్ గ్రామంలో గల ఉన్నత విద్యార్థులకు మాజీ సర్పంచ్ పుప్పాల లక్ష్మీ, గంగారెడ్డి బెల్టు, బ్యాడ్జ్, టైలు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ.. దాదాపు రూ.8వేల విలువ కలిగినవి వితరణ చేశారన్నారు. విద్యార్థులు మంచిగా చదువుకొని అభివృద్ధి కావాలని సర్పంచ్ గంగారెడ్డి కోరారు. పాఠశాలకు దాతగా నిలిచిన గంగారెడ్డిని ప్రధానోపాధ్యాయులు రాజేందర్ అభినందించారు. గ్రామస్తులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



టై, బెల్టులు అందజేస్తున్న దాతలు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎంపిడిఓ

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని ఇందిరానగర్ తండా, భేలియా తండా, మరియా తండా, కేశారం గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎంపిడిఓ బాలకృష్ణ పరిశీలించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ రానున్న పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎన్నికల ఏర్పాట్లు చేయడం జరుగుతుందని, ఇందులో భాగంగానే పోలింగ్ కేంద్రాలను పరిశీలించామని తెలిపారు. కార్యక్రమంలో ఆయాగ్రామపంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎపీడీవో

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మోర్తాడ్

మృతుని కుటుంబానికి 5 లక్షల రూపాయల ఆర్థికసాయాన్ని తహసీల్దార్ సత్యనారాయణ మంగళవారం అందజేశారు. ఇటీవల మొండి వాగులో చేపలు పట్టడానికి వెళ్లిన సురేష్ మృతి చెందగా తక్షణ సహాయం కింద ఐదు లక్షల రూపాయల నిధులను బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జి ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి మంజూరు చేయించారు. మంజూరైన చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై విక్రం ఉన్నారు.

ఆకట్టుకుంటున్న శివలింగ గణపయ్య

నవతెలంగాణ-నవీపేట్



మండలంలోని నాళేశ్వర్ గ్రామంలో బ్రదర్ యుత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శివలింగ గణపయ్యను బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. శివ లింగంపై పాలతో అబిషేకం చేస్తున్న గజనాథుడు భక్తులకు విశేషంగా ఆకట్టుకున్నాడు. భక్తులతో కలిసి పూజ కార్యక్రమాలు నిర్వహించి ప్రసాదాన్ని భక్తులకు పంచారు. ఈ కార్యక్రమంలో బ్రదర్స్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

గణపతి మండపాలను దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

హమాల్ వాడి గాంధీ గణేష్ మండలి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన హెూమంచ అన్నదానం కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, 35వ డివిజన్ కార్పొరేటర్ ఎర్రం సుధీర్, విక్కీ యాదవ్, ఎర్రం గంగాధర్, రంజిత్, బీజేపీ నాయకులు ఆనంద్, పవన్ ముందడ, హరీష్, బాబీసింగ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పదివేల ఆర్థిక సహాయం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలకేంద్రంలోని గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుడైన వడ్డే హనుమంతుకు తోటి అభివృద్ధి కమిటీ సభ్యులు రూ. పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. అనారోగ్యానికి గురై ఆరోగ్యం క్షీణించడం వల్ల వైద్యం చేయించుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న హనుమంతుకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ మేరకు మంగళవారం గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు హనుమంతు ఇంటికి వెళ్లి పరామర్శించారు. గ్రామ అభివృద్ధి కమిటీ నుండి రూ. పదివేల ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులకు హనుమంతు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, కోశాధికారి నూకల బుచ్చి మల్లయ్య, సభ్యులు సున్నం మోహన్, గణేష్, నిమ్మ రాజేంద్ర ప్రసాద్, ఇతర సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు టై, షూలు అందజేత

నవతెలంగాణ-డిచ్‌పల్లి

జన్మదినం సందర్భంగా తనవంతుగా సహకారంగా టై, షూలు, సాక్స్‌లను మంగళవారం మండలంలోని అమృత పూర్ గ్రామంలోని మండల పరిషత్, ప్రాథమికోన్నత పాఠశాలలో అందజేశారు. గ్రామంలో పుట్టి పెరిగి కామారెడ్డి లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కూరపాటి కేశవులు తమ పుట్టిన రోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఎంఎల్ పవన్ కుమార్ మాట్లాడుతూ.. ఆరేళ్లుగా విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, ఇతరత్రా వితరణ చేశారని వారి సేవా నిరతిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు కృష్ణ, గంగాధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

టీయూకి వెంటనే వీసీని నియమించాలి

- ఇంజనీరింగ్ కోర్సులను తీసుకురావాలి
- ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి కి పీడీఎస్‌యూ వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

గత ఏడాదిన్నర నుండి యూనివర్సిటీలో రెగ్యులర్ వైస్ ఛాన్సలర్ లేకపోవడం వల్ల విద్యార్థుల అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, తెలంగాణ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెడితే జిల్లా విద్యార్థులకు, పక్కన ఉన్న జిల్లాల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడు తుందని పిడిఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అన్నారు. మంగళవారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జన్నారపు రాజేశ్వర్ మాట్లాడుతూ.. ఏడాదిన్నర నుండి యూనివర్సిటీలో రెగ్యులర్ విసి లేకపోవడం వల్ల విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, మైగ్రేషన్ కాన్వకేషన్, మెమోలు అప్లై చేసుకుని నెలలు గడిచిన ఇవ్వడం లేదని, దీనివల్ల విద్యార్థులు పైచదువులను, ఉద్యోగ అవకాశాలను కోల్పోతున్నారని తెలిపారు. నూతనంగా మరో గర్ల్స్‌హాస్టల్ ను నిర్మించాలని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, హెల్త్ సెంటర్ ఇద్దరు ఏఎన్ఎంలతోనే కొనసాగిస్తున్నారని, రోగమస్తే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సి వస్తుందని, ఇందులో సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. తెలంగాణ యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కోర్సులను ప్రవేశపెడితే జిల్లా, పక్కన ఉన్న జిల్లాలకు చెందిన విద్యార్థులకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రిన్స్, దేవిక, వంశీ, నిఖిల్ పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే రిజర్వేషన్లు సాధ్యం

- రాజ్యసభ సభ్యులు, బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య

నవతెలంగాణ-ఆర్మూర్

బీసీలకు న్యాయం జరగాలంటే ఉద్యమాలతోనే రిజర్వేషన్లు సాధ్యమవుతాయని రాజ్యసభ సభ్యులు బిసి సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ఎంఆర్ గార్డెన్లో మంగళవారం జరిగిన బీసీల సదస్సులో ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. చట్టసభలతో పాటు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు లేక బీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం కళ్ళు తెరిచే విధంగా అవసరమైతే మిలిటెంట్ ఉద్యమం చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ప్రతి బీసీ కుటుంబానికి ప్రభుత్వం 20 లక్షలు రుణమిచ్చి ప్రోత్సహించాలని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ అమలు పరుస్తానని చెప్పిన బీసీల రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేదన్నారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవిలు మాట్లాడుతూ 61 శాతం జనాభా ఉన్న బీసీలకు రాజ్యాధికారం లేక అణచివేయ పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిజామాబాద్ గడ్డ విప్లవాల అడ్డ అని ,,ఈ ప్రాంతం నుంచి బీసీల ఉద్యమం ప్రారంభమై రాష్ట్రవ్యాప్తంగా వ్యాపిస్తుందన్నారు. బిసి సంఘం నాయకులు రాజారామ్ యాదవ్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో ఉత్తర రాష్ట్ర తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు శ్రీమతి కూరపాటి అరుణ జ్యోతి,బిసి నాయకులు దేగాం యాదగౌడ్, మోతే రమా గౌడ్, శ్యాం, అశోక్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చాకలి ఐలమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

ఐలమ్మ విగ్రహానికి, చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-విలేకరులు

సిరికొండ: అణిచివేతకు, అన్యాయాలకు వ్యతిరేకంగా గొంతువిప్పి, తొలి భూపోరాటానికి నాంది పలికుతూ, తెలంగాణ తెగువను ప్రపంచానికి చాటిన సబ్బండ వర్గాల ఆత్మగౌరవ ప్రతీక తెలంగాణ పోరాట స్ఫూర్తి చాకలి ఐలమ్మ అని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపల్ ఆర్. నర్సయ్య అన్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమ పోరాట యోధురాలు, మహిళా చైతన్యానికి, ఆత్మగౌరవానికి ప్రతీక చిట్యాల ఐలమ్మ 39వ వర్ధంతిని పురస్కరించుకొని సత్యశోధక్ ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య చాకలి ఐలమ్మ చిత్రపటానికి మహిళా ఉపాధ్యాయులతో కలిసి పూలమాలనలంకరించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ తొలి దశ, సాయుధ రైతాంగ పోరాటంలో నిజాం నిరంకుశంత్వాన్ని, దొరల భూస్వాముల పాలనను వ్యతిరేకిస్తూ, వివక్షను, ఆధిపత్యాన్ని ఎదురిస్తూ భూమికోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం అణగారిన వర్గాల ప్రజల వాటాకోసం అలుపెరుగని పోరాటం చేసిన వీరనారి ఐలమ్మ అని కొనియాడారు. కార్యక్రమంలో సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు

కంఠేశ్వర్: చాకలి ఐలమ్మ వారసత్వం తెలంగాణ ఆడబిడ్డలది అని, ధైర్యం, సాహసం, శ్రమించే తత్వం తెలంగాణ మహిళలకు ఆభరణం అని, ఆమె ధైర్య సాహసాలను ఆవహించుకోవాలని ప్రముఖ కవి తెలుగు ఉపాధ్యాయుడు ఘనపురం దేవేందర్ అన్నారు. సారంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పీడిత ప్రజలందరికీ చాకలి ఐలమ్మ జీవిత చరిత్ర ఒక స్ఫూర్తి అని, ఆమె జీవన ప్రయాణం గమనిస్తే కష్టాలలో ఉన్న మహిళలకు వాటిని విజయవంతంగా ఎదిరించే శక్తినిస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రధానోపాధ్యాయురాలు లలిత మాట్లాడుతూ.. విద్యార్థులు ఆమె జీవితచరిత్ర చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డాక్టర్ సల్ల సత్యనారాయణ, ఎస్ గంగాధర్, టి గోపాల్, మహమ్మద్ జావిద్ విద్యార్థులు పాల్గొన్నారు.

నవీపేట్: మండలంలోని నాగేశ్వర్ గ్రామంలో చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆమె విగ్రహానికి రజక సంఘ సభ్యులతో కలిసి బినోల సొసైటీ చైర్మన్ మగ్గరి హన్మాన్లు, మాజీ సర్పంచ్ సరీన్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చైర్మన్ మగ్గరి హన్మాండ్లు మాట్లాడుతూ తెలంగాణలో పెత్తందారీ విధానానికి వ్యతిరేకంగా ఆత్మ గౌరవ నినాదాన్ని వినిపించి దొరల గడిల మంచి విముక్తికై పోరాడిన యోధురాలు ఐలమ్మ అని అన్నారు. కార్యక్రమంలో చిన్న బీమా రెడ్డి, శ్రీనివాస్, భూషణ్, రజక సంఘ సభ్యులు ప్రవీణ్ పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: ఈ భూమినాది... పండించిన పంటనాది... తీసుకెళ్లడానికి దొరెవ్వడు..." నా ప్రాణం పోయాకే ఈ పంట, భూమి మీరు దక్కించుకోగలరు.. అంటూ మాటల్ని తూటాలుగా మల్చుకొని దొరల గుండెల్లో బడబాగ్ని రగిల్చిన తెలంగాణ రైతాంగ విప్లవాగ్ని చాకలి అయిలమ్మ అని బీసీ సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ స్రవంతి హాజరయ్యారు. నగరంలోని అమరవీరుల పార్కులోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏనుగంధుల మురళీ, జిల్లా సంయుక్త కార్యదర్శి మెతుకు శివ కుమార్, పట్టణ ఉపాధ్యక్షులు శుభాష్, లింగం, శంకర్, తదితరులు పాలుగొన్నారు.

తెలంగాణ వీర వనిత చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా వినాయక నగర్ విగ్రహాల పార్క్ వద్ద ఐలమ్మ విగ్రహానికి అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు.... నిజాం నిరంకుశ పాలనలో దొరలు, భూస్వాములు, పెత్తందారులు బడుగు, బలహీన వర్గాల ప్రజలను వెట్టిచాకిరీ చేపిస్తు బానిసలుగా చూస్తున్న రోజుల్లో భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం దున్నేవాడిదే భూమి అంటు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా విస్నూర్ దేశ్ ముఖ్‌ను ఎదిరించిన తెలంగాణ వీర వనిత సాకాలి ఐలమ్మ అని అన్నారు. రాణి రుద్రమ్మ పౌరుషాన్ని పాలు పంచుకున్న ఓరుగల్లు ముద్దు బిడ్డ చాకలి ఐలమ్మ ఆనాడు ఆమె పండించిన పంటను దొర గుండాలు అక్రమంగా తీసుకెళు ంటే ఎదురు తిరిగి తరిమి కొట్టిన ఆమె విజయం తెలంగాణలో భూ పోరాటానికి నాంది పలికేలా చేసిందని అన్నారు. సాకలి ఐలమ్మ స్ఫూర్తి నేటి మహిళా లోకానికి ఆదర్శం అని తెలిపారు. ఆడవాళ్లు అంటే వంటింటి కుందేళ్లు అనుకునే సమాజంలో కేంద్ర నరేంద్ర మోడీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్ తెచ్చి యావత్ మహిళా లోకాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకుపోయే లక్ష్యంతో బిజెపి పనిచేస్తుందని అన్నారు. నేటి మహిళలు సాకాలి ఐలమ్మ, రాణి రుద్రమ్మ, ఝాన్సీ రాణి లాంటి వీర వనితల పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. కార్యక్రమంలో బీసీ.డెవలప్మెంట్ ఆఫీసర్ స్రవంతి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మీనారాయణ, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్నాటి కార్తీక్, ఆనంద్, పవన్, కిరణ్, భూమేష్, హరీష్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌సిటీ : నివాళ్లు అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

జక్రాన్‌పల్లి : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు వీరనారి చిట్యాల సాకలి ఐలమ్మ అని రజకులు అన్నారు. చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రజక సంఘ సభ్యులు..సాగర్ అజయ్ గంగారాం శ్రీనివాస్ నరేష్ నారాయణ వర్షిత్ తిరుపతి సుమన్ పోషన్న మరియు తదితరులు పాల్గొన్నారు..

నవతెలంగాణ కథనానికి స్పందన

మీసేవా కేంద్రాలు తనిఖీ



మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న అధికారి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

"నవతెలంగాణ" దినపత్రికలో సోమవారం ప్రచురితమైన 'మీ సేవలో మాయజాలం?' కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. ఇందల్ వాయి మండలంలోని పలు చోట్ల ఉన్న మీసేవ కేంద్రాలకు జిల్లా ఉన్నతాధికారులు, తహసిల్దార్ వెంకట్రావు ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారి మోహన్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మీ సేవ సెంటర్ చుట్టుపక్కల పలువురిని, సర్టిఫికెట్లకు దరఖాస్తులు చేసుకున్న వారితో, గతంలో ఫిర్యాదులు చేసిన వారి నుండి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఒక మీసేవాకేంద్రంలో చీరెలు, గాజులు తదితర వాటిని ఉంచుకొని వ్యాపారం చేస్తుండడంతో మండల రెవెన్యూ అధికారి మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే తొలగించాలని ఆదేశించారు. ప్రభుత్వ నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకట్రావు, మండల రెవెన్యూ అధికారి మోహన్ మాట్లాడుతూ పలు మీసేవ కేంద్రాలను సందర్శించినప్పుడు కొన్ని ఫిర్యాదులు వచ్చాయని, ఇంకోన్ని లోటుపాట్లు ఉన్నాయని తెలిపారు. మొదటిసారి వాళ్లకు హెచ్చరించడం జరిగిందని, మరోసారి నిబంధనలకంటే ధరల కంటే ఎక్కువ వసూలు చేస్తే మీ సేవ సెంటర్లను సీజ్ చేయడం జరుగుతుందన్నారు. పలువురి నుండి వివరణ తీసుకున్నామని వాటిని ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని మండల రెవెన్యూ అధికారి మోహన్ నవతెలంగాణ వివరించారు. ఒకటి, రెండు రోజుల్లోనే మండలంలో ఉన్న మీసేవ సెంటర్ల నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి నిబంధనలు వివరిస్తామన్నారు. మీ సేవ సెంటర్లలో వచ్చిన దరఖాస్తులను వెంటనే తాసిల్దార్ కార్యాలయానికి అప్పజెప్పాలని ఆదేశించారు.

ఆవుపేడ, మూత్రంతో ప్రకృతి వ్యవసాయం చేయొచ్చు

- ప్రకృతి వ్యవసాయదారుడు చిన్నికృష్ణుడు
- తెలుసుకోవడానికి చింతలూరుకు వచ్చిన రైతులు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

ప్రకృతి వ్యవసాయం గురించి తెలుసుకోవడానికి రాష్ట్రంలోని నాలుగు జిల్లాల రైతులు మండలంలోని చింతలూరు గ్రామానికి వచ్చినట్లు ప్రకృతి వ్యవసాయదారుడు చిన్ని కృష్ణుడు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా నాలుగు జిల్లాల రైతులు చిన్ని కృష్ణుడి వరి పొలాన్ని పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహబూబ్‌నగర్, సంగారెడ్డి, జగిత్యాల నుండి ఐదుగురు చొప్పున, నిజామాబాద్ జిల్లా నుండి ఎనిమిది మంది రైతులు, చింతలూరు గ్రామం నుంచి ఆరుగురు రైతులు వచ్చారని నాగుల గంగారాం, అలియాస్ సిన్నికృష్ణుడు తెలిపారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం గురించి వారికి వివరిస్తూ కాంప్లెక్స్ ఎరువు తయారీ, వరి నారు వేసే ముందు అడుగు మందుగా రైతులు కాంప్లెక్స్ ఎరువులు వేస్తారని తెలిపారు. ప్రకృతి వ్యవసాయంలో ఎకరానికి 50 కిలోల పల్లి పిండి, 50 కిలోల వేప పిండిని చల్లాలని వివరించారు. పొలం వేసిన 20 నుంచి 30 రోజుల మధ్య యూరియా చల్లేబదులు ఆవు పాలు రెండు లీటర్లు 15 రోజులు ఒక కుండలో రాగి ముక్క వేసి కుండపై భాగాన బట్టతో కట్టి పులియ పెట్టాలని తెలిపారు. పులియబెట్టిన పాలు పెరుగుగా మారుతుందని, మీగడను తొలగించి ఆ రెండు లీటర్ల పెరుగులో ఇంకా రెండు లీటర్లు వాటర్ కలిపి ఎకరానికి 8 పంపులు స్ప్రే చేసినట్లయితే నారు పచ్చగా మారి ఎదుగుతుందని తెలిపారు.



ప్రకృతి వ్యవసాయం గురించి వివరిస్తున్న చిన్నకృష్ణుడు

మోగి పురుగు నివారణకు

100 గ్రాముల వేప గింజల పౌడర్‌ను ఒక బట్టలో మూటగట్టి ఒక కట్టెకు కట్టి ఒక కుండలో నీళ్లు పోసి ఆ నీటిలో కట్టెకు కట్టిన 100 గ్రాముల వేప గింజల పౌడర్‌ను 36 గంటలు నానబెట్టి తర్వాత దానిని ఎకరానికి ఎనిమిది పంపులు స్ప్రే చేసినట్లయితే మెగిపురుగు ఆశించదని తెలిపారు.

చతుర్గవ్యం..

నాలుగు పదార్థాలతో కలిపి నటువంటి దానిని చతుర్గవ్యం అంటారని అన్నారు. ఆవు పెండ 10 కేజీలు, 20 లీటర్ల మూత్రం, ఆఫ్ లీటర్ పాలు, ఆఫ్ లీటర్ పెరుగు కలిపి ఎకరానికి చల్లుకోవాలని తెలిపారు. చల్లుకునే ముందు ఐదు లీటర్ల నీళ్లు తీసుకుని ఒక లీటరు తయారు చేసిన ద్రవాన్ని కలుపుకొని పొలమంతటా చల్లుకున్నట్టు అయితే ఎటువంటి పురుగు ఆశించదని తెలిపారు. ఈ సందర్భంగా చిన్ని కృష్ణుడు మాట్లాడుతూ.. ఆవు మూత్రాన్ని పెండను సేకరించినట్లయితే ప్రకృతి వ్యవసాయం చేయవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో పలు జిల్లాల ఆదర్శ రైతులు తదితరులు పాల్గొన్నారు.

గణపతులవద్ద అన్నదానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/మోపాల్

గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో స్నేహమిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మోపాల్ : మండల కేంద్రంలోని ఛత్రపతి శివాజీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్సై యాదగిరి గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ముందుండాలని, ఎల్లప్పుడు పదిమందికి ఉపయోగపడే విధంగా వారి నడవడిక ఉండాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు వంశి, రంజిత్, పురుషోత్తం, వినోద్, ప్రశాంత్, హరీష్, కిరణ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు

రౌడీ షీటర్ బైండోవర్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన నర్రా నవీన్‌ను తహసీల్దార్ ముందట బైండోవర్ చేసినట్టు ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపారు. రౌడీ షీటర్ నర్ర నవీన్‌ను పోలీస్ స్టేషన్‌కు పిలిచి కౌన్సెలింగ్ చేసి, అనంతరం మంచి నడవడిక కలిగి ఉండాలని బైండోవర్ చేసినట్టు ఎస్సై తెలిపారు.

పౌష్టికాహారంతో హిమోగ్లోబిన్‌ను పెంచుకోవచ్చు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈ ఆరు నెలల్లో కావలసినంత హిమోగ్లోబిన్ ను అభివృద్ధి చేసుకునే సమయం ఉంటుందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని వై శంకర్ అన్నారు. మంగళవారం ఇందల్‌వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గన్నారం గ్రామ ఉప కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ పాల్గొని మాట్లాడుతూ.. గర్భిణీ స్త్రీలు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. గర్భిణీ స్త్రీలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 12 వారాలలోపు నమోదు చేసుకున్న తర్వాత ప్రసవం అయ్యే లోపల ఆరు నెలల సమయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ ఆరు నెలల్లో వారికి కావలసిన హిమోగ్లోబిన్‌ను అభివృద్ధి చేసుకునే సమయం ఉంటుందని, ఈ ఆరు నెలల సమయంలో సరైన పౌష్టికాహారాన్ని తీసుకున్నట్లయితే అనగా ఐరన్ సమృద్ధిగా గల ఆకుకూరలు, కూరగాయలు, బెల్లం పల్లి పట్టీలు, మునగ, ఆకు మునగకాడలు, కరివేపాకు, గోంగూర, బీట్రూట్, క్యారెట్, కోడిగుడ్లు, పాలు సమృద్ధిగా తీసుకున్నట్లయితే వాటిలో గల ఐరన్‌తో హిమోగ్లోబిన్ అధికంగా ఏర్పడి గర్భిణీ స్త్రీ ప్రసవానికి కావలసిన రక్తం అభివృద్ధి చెందుతుందని వివరించారు. ప్రసవానంతరం శిశువులకు ఇచ్చే పాలు అధికంగా కావాలంటే బాలింత ఎక్కువ మొత్తంలో పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ శోభ, ఆరోగ్య కార్యకర్తలు రేణుక, ఇందిర, ఆనంద్, అంగన్వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ఆరోగ్య విస్తరణ అధికారి

డిచ్‌పల్లి మండలంలోని నడిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గాంధీ నగర్ లెవెల్ ప్రోగ్రామ్ నిర్వహించారు.ఈ సందర్భంగా పౌష్టికాహారం విలువలపై అవగాహన కల్పించారు. ప్రీస్కూల్ పోషణ అభియాన్ లో భాగంగా స్టోరీ బుక్స్ లోని ఆసక్తికరమైన చిత్రాలను ప్రదర్శించారు. చిత్రాలను ఆధారంగా సులభతరంగా ఏ విధంగా చెప్పాలి, కథల పుస్తకాల్లోని చిత్రాలు, స్నేహితులు, పిల్లల తోటి ఉపాధ్యాయులతో ఎలా ప్రోత్సాహం తీసుకోవాలని సూచించారు. పిల్లల ఉపాధ్యాయులతో కలిసి కథలు, వ్యాసాలు, పద్యాలు అవగాహన ఏ విధంగా చేసుకోవాలో వివరించారు. ప్రీస్కూల్‌పైన అవగాహన కల్పించారు.

లారీ ఢీకొని వృద్ధురాలు మృతి

- ఇంకొకరికి తీవ్ర గాయాలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారి జాతీయ రహదారి -44 మెంట్రాజ్ పల్లి శివారులో మంగళవారం ఒక లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న సంఘటనలో ఓవృద్ధురాలు మృతి చెందింది. ఇంకొక్కరికి గాయపడ్డారు. డిచ్ పల్లి ఎస్‌హెచ్‌ఓ మహమ్మద్ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం... జక్రాన్ పల్లి మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన అల్లూరి భోజన్న భార్య నర్సు బాయి(60) డిచ్ పల్లి మండలం లోని సుద్దపల్లి గ్రామానికి వెళ్లి వస్తానని ఇంటి నుండి వెళ్ళింది. అదే గ్రామానికి చెందిన రంగు నారాయణ గౌడ్ కూడా అదే సమయంలో డిచ్‌పల్లికి తన బైక్ పైన వెళ్తుండగా నర్సుబాయిని తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని సుద్దపల్లి బయలు దేరి వెళ్లారు. ఇద్దరు కలిసి వెళ్లే క్రమంలో మెంట్రాజ్‌పల్లి గ్రామ శివారులో ఆర్మూర్ నుండి హైదరాబాదు వైపు వెళ్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈప్రమాదంలో వాళ్ళిద్దరూ కింద పడిపోవడంతో నర్సుబాయి తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే ఆమెను జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి కి తరలించారు. ఆసుపత్రి వద్దనే నర్సు బాయి మృతి చెందింది. నారాయణగౌడ్ తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మృతురాలి భర్త భోజన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ మొహమ్మద్ షరీఫ్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మార్చురికి తరలించినట్లు ఆయన వివరించారు. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నట్లు తెలిపారు.



నర్సుబాయి మృతదేహం

ప్రముఖ కవి ఆయాచితం నటేశ్వరశర్మ మృతి



నటేశ్వర శర్మ (ఫైల్)

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రముఖ కవి, దాశరథి పురస్కార గ్రహీత డాక్టర్ ఆయాచితం నటేశ్వర శర్మ మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. మండలంలోని రామారెడ్డిలో 17 జూలై 1956లో జన్మించారు. ఓయూలో ప్రాచ్య భాష పీఠాధిపతిగా సేవలందించారు. కామారెడ్డిలోని ప్రాచ్య విద్యా పరిషత్, ప్రాచ్య కళాశాలలో 1977 నుంచి సాంస్కృత విభాగ ఆచార్యులు పనిచేశారు. వివిధ విశ్వవిద్యాలయంలో పనిచేసి, 2014 జూలైలో ఉద్యోగ విరమణ పొందారు. రచనలు, పద్యాలు రచించి, అనేక పురస్కారాలను అందుకున్నారు. ఆయన మృతిపట్ల శిష్యులు, గ్రామస్తులు, పలువురు దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.

దూపల్లిలో సీపీఐ(ఎం) జెండావిష్కరణ



జెండావిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

బోధన్ అసెంబ్లీ నియోజకవర్గం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) జెండాను కామ్రేడ్ మునురి శంకర్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సభకు ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పెద్దివెంకట్ రాములు, ఏశాల గంగాధర్ హాజరై మాట్లాడారు. ఈ నెల మొత్తం గ్రామాలు, మండలాల పరిధిలో సిపిఐ(ఎం) జెండాలను ఆవిష్కరించనున్నట్టు తెలిపారు. అక్టోబర్ 20, 21 తేదీలలో జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను వీడనాడి వారు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, అజ్జపు సాయిలు, శ్రీనివాస్, మస్కట్ సాయిలు, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

పౌరహక్కులపై ప్రతిగ్రామంలో సదస్సులు

- **ప్రతినెల నిర్వహించాలి : రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య**

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లాలోని అన్ని గ్రామాలలో సివిల్ రైట్స్ డే ప్రతీ మాసం నిర్వహించాలని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం ఐడిఒసీలోని సమావేశ మందిరంలో లాండ్ సర్వీసెస్, అట్రాసిటీపైన కమిటీ సభ్యులతో కలిసి సమీక్ష సమావేశం జిల్లా కలెక్టర్, ఎస్పీ, జిల్లా అధికారులతో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, గ్రామాల్లోని ప్రజలకు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం పై ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతీ మాసం చివరి రోజున సివిల్ రైట్స్ డే తప్పని సరిగా నిర్వహించాలని అన్నారు. జిల్లాలో జరిగిన ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న అట్రాసిటీ కేసులు, భూ సంబంధ కేసులు, సర్వీస్ మాటర్స్ లకు సంబంధించిన వాటిపై ఒక నెల లోపు పూర్తిచేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు. రాష్ట్రం లోని అన్ని జిల్లాలకు కమిషన్ పర్యటిస్తున్నదని చెప్పారు. జిల్లా స్థాయి సమావేశ వివరాలను కమిషన్‌కు తెలియ పరచాలని పేర్కొన్నారు. కేసుల పూర్వాపరాలను పోలీసు అధికారులు పరిశీలించాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే అర్జీ దారు లను గౌరవించి సమస్యలను తెలుసుకోవాలని సూచించారు. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలకు సంబంధించిన వసతి గృహాలను పరిశీలించాలని అధికారు లను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ ల రక్షణ కోసం కమిటీ పనిచేస్తున్నారని వివరించారు. జిల్లాలో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం చర్యలు చేపట్టాలని కలెక్టర్ కు తెలిపారు.



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదైన వారికి నిబంధనల ప్రకారం పరిహారం అందిస్తున్నామని తెలిపారు. భూములకు సంబంధించిన కేసులు పరిశీలిస్తున్నామని చెప్పారు.

ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు పోలీస్ శాఖ ద్వారా నమోదైన కేసుల వివరాలను వివరించారు. ఈ సందర్భంగా జిల్లాలో జరిగిన పలు కేసులకు సంబంధించి పలువురు జిల్లా స్థాయి కమిటీ సభ్యులు, వివిధ సంఘాల ప్రతినిధులు కమిషన్ దృష్టికి పలు సమస్యలు విన్నవించారు. కమిషన్ సభ్యురాలు నీలాబాయి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరు చదువు కోవడం ద్వారా చట్టాలు తెలుసుకోవచ్చని అన్నారు. కమిషన్ సభ్యుడు లక్ష్మి నారాయణ మాట్లాడుతూ, నిజమైన అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని, సివిల్ రైట్స్ డే ప్రతీ మాసం నిర్వహించాలని అన్నారు. రాంబాబు నాయక్ మాట్లాడుతూ, షెడ్యూల్ కులాలు, తెగల సంక్షేమం కోసం కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, న్యాయం కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ సంక్షేమ అధికారిని రజిత, ఆర్డీవోలు రంగనాథరావు, ప్రభాకర్, డీఎస్పీలు శ్రీనివాసులు, సత్యనారాయణ, నాగేశ్వరరావు, వివిధ సంఘాల నాయకులు, కమిటీ సభ్యులు, పలువురు సమావేశంలో పాల్గొన్నారు.

పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీర వనిత చాకలి ఐలమ్మ



వెట్టి చాకిరి విముక్తి కోసం పోరాడి తెలంగాణ ప్రజల తెగువను పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి చాటిన వీర వనిత చాకలి ఐలమ్మ అని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం ఆవరణలో మంగళవారం చాకలి ఐలమ్మ వర్ధంతి వేడుకలు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ చిత్రపటానికి ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐలమ్మ ధైర్యసాహసాలు, చైతన్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకంగా ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలిచిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సింధు శర్మ జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్, వసతి గృహం సంక్షేమ అధికారులు చక్రధర్, సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమిలేయర్ అమలు చేయాలి

- **దళిత వికాస్ సమితి రాష్ట్ర అధ్యక్షులు కిన్నెర సిద్దార్థ**

నవతెలంగాణ-సదాశివనగర్

ఎస్సీ రిజర్వేషన్‌లో క్రిమిలేయర్‌ను అమలు చేయాలని దళిత వికాస్ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిన్నెర సిద్దార్థ అన్నారు. మంగళవారం మండలంలోని మోడెగాం గ్రామంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల సెప్టెంబర్ 1న ఆదిలాబాద్ జిల్లాలో పాదయాత్ర ప్రారంభించామని, అక్టోబర్ 10న గద్వాల్ జిల్లా అలంపూర్ పాదయాత్ర ముగుస్తుందని తెలిపారు. బి.సిలలో 6లక్షలు, ఓ.సిలలో 8 లక్షల ఆదాయం ఉంటే క్రిమిలేయర్ వర్తిస్తుందని వివరించారు. ఎస్సీలలో ఎం.పిలు ఎమ్మెల్యేలు ఐఎఎస్, ఐపీఎస్ పిల్లలకు క్రిమిలేయర్ వర్తించడం లేదని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఒక కుటుంబంలో ఒకరికే పింఛన్లు పంపిణీ చేస్తున్నారని తెలిపారు. ఎస్సీ ఒక కుటుంబంలో 4 ఉద్యోగాలున్నా క్రిమిలేయర్ వర్తిస్తలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్రిమిలేయర్ విధానాన్ని వెంటనే అమలు చేయలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లింగం, సదాశివనగర్ అధ్యక్షుడు గౌడెల్లి గంగాధర్, దాసరి నర్సింలు, బాల్‌రాజు, భాస్కర్, చిన్న బాలయ్య, గన్నారం రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలో ఉన్న దక్షిణ కాశి శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ హుండీని అసిస్టెంట్ కమిషనర్ విజయ రామారావు ఆధ్వర్యంలో మంగళ వారం ఆలయ ప్రాంగణంలో సాయి సేవా సమితి మహిళలు లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీధర్ మాట్లాడుతూ ఆలయానికి భక్తులు 6 లక్షల 80 వేల 683 రూపాయలు కానుకలు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పోషణ అభియాన్‌పై అవగాహన

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని మండలాల పరిధిలోని అంగన్వాడీ టీచర్లకు మద్నూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాల యంలో మంగళవారం ప్రత్యేకంగా అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ అవగాహన సదస్సులో పోషణ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ కళావతి రాథోడ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ సెంటర్లలో పరిశుభ్రత నాణ్యత ప్రీస్కూల్ కార్యక్రమాలు ఆరోగ్యలక్ష్మి భోజనం అన్ని విషయాలపై అంగన్వాడి టీచర్లకు అవగాహన కల్పించారు. అదేవిధంగా పిల్లలకు అక్షరా భ్యాసం నిర్వహించారు. దాంతోపాటు పోషణ ప్రతిజ్ఞ, అలాగే ప్రీస్కూల్ ప్రతిజ్ఞ చేయించారు. పోషణ మాసంలో భాగంగా అన్ని విధాల పోషకా హారాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మద్నూర్ ఎంపీడీవో, స్పెషల్ ఆఫీసర్, మద్నూర్ ప్రాజెక్టు పరిధిలోని సూపర్‌వైజర్స్, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

గురుకుల విద్యాలయాన్ని కామారెడ్డి నుంచి లింగంపేట్‌కు తరలించాలి

- **తెలంగాణ ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మెన్‌కు, కలెక్టర్‌కు వినతి**

నవతెలంగాణ-లింగంపేట్

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఉన్న గురుకుల విద్యాలయాన్ని లింగంపేట్‌కు తరలించాలని కోరుతూ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్ బక్కి వెంకటయ్యకు, కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు జాతీయ విద్యార్థి మోర్చా రాష్ట్ర కార్యదర్శి విట్టల్ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లింగంపేట్ మండల కేంద్రానికి సంబంధించిన ఎస్సీ గురుకుల బాలికల విద్యాలయాన్ని కామారెడ్డికి తరలించడంతో విద్యార్థుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లింగంపేట్ మండల కేంద్రంలో ఏర్పాటు చేయవలసిన ఎస్సీ గురుకుల బాలికల విద్యాలయాన్ని గతంలో అధికారులు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి ప్రాతంలోని ఆర్య క్షత్రియ సంఘం భవనం పక్కన గల భవనంలోకి మార్చారని వివరించారు. ఆ భవనంలో సరైన గదులు లేకపోవడం విద్యార్థులకు ఆడుకోవడానికి ఎలాంటి ఆటస్థలం లేదన్నారు. నీటి సమస్యతో విద్యార్థులు కొన్ని రోజులు స్నానం చేయకపోవడం, మరుగుదొడ్ల, వర్షం పడితే కిటికీలోంచి వాటర్ రావడం, బట్టలు అరబెట్టడానికి స్థలం లేకపోవడం పలు సమస్యలతో విద్యార్థులు తీవ్ర మానసికంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఆ భవనంలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేవన్నారు. బాలికల విద్యాలయాన్ని లింగంపేట్ మండల కేంద్రానికి తరలించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మెన్, కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

ఐలమ్మ చిత్రపటానికి నివాళి



ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో చిట్యాల ఐలమ్మ వర్ధంతిని మంగళవారం నిర్వహించినట్లు తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్ది వెంకట్ రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సమయంలో ఆనాటి దేశ్‌ముఖ్‌లు, జమీందారులు, జాగీర్‌దారుల అరాచకాలకు ఎదురోడ్డి భూమికోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన వాళ్లలో చిట్యాల ఐలమ్మ ఒకరని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం కార్యదర్శి ఏశాల గంగాధర్, లక్ష్మయ్య, శంకర్‌గౌడ్, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రజకసంఘం ఆధ్వర్యంలో బాధితులకు ఆర్థిక సహాయం

నవతెలంగాణ-బోధన్

సాలూర రజకసంఘం ఆధ్వర్యంలో అగ్నిప్రమాద బాధితులకు మంగళవారం ఆర్థిక సహాయం చేశారు. సాలూర గ్రామంలో గత వారం క్రితం అగ్నిప్రమాదం సర్వస్వం కోల్పోయిన కుటుంబానికి వారు చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఆర్థిక సహాయం చేపట్టినట్లు అధ్యక్షులు లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో సంతోష్, రాములు, అశోక్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి ఎంఈఓగా నాగనాథ్ బాధ్యతల స్వీకరణ



ఇంచార్జి ఎంఈఓను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-ఎడపల్లి

ఎడపల్లి మండల ఇంచార్జి విద్యాశాఖ అధికారిగా (ఎంఈవో)గా నాగనాథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం సుమారు 6 మండలాలకు ఇన్చార్జిగా వ్యవహ రిస్తున్నారు. ఎడపల్లి మండల ఎంఈఓగా విధులు నిర్వహించిన రామారావు స్థానంలో కోటగిరి మండల ఎంఈఓ నాగనాథ్ ఎడపల్లి మండల ఇన్చార్జి ఎంఈఓగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పీఆర్టీయూ మండలాధ్యక్షులు సిహెచ్ సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శి తూప్రాన్ గోవర్ధన్, ప్రధానోపాధ్యాయులు రమేష్, వెంకటేష్, సాయిలు, జోన్స్, ఎస్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, పిఆర్‌టియు అసోసియేషన్ గౌరవాధ్యక్షులు శ్రీనివాస్‌రావు, కార్యదర్శి లింగ బాలేష్, మహిళ విభాగం ఉపాధ్యక్షులు నూర్జహాన్, యూనియన్ నాయకులు నరేందర్ కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, శివ రాజన్, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు నూతన ఇంచార్జి ఎంఈవోను ఘనంగా సన్మానించారు.

ఉప్పొంగిన 'భగీరథ నీరు'



పొంగుతున్న భగీరథ నీరు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బీర్కూర్ మండల కేంద్రంలోని బీర్కూర్ బాన్సు వాడ వెళ్లే రహదారి మార్గ మధ్యలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలిపోయింది. దీనితో పైప్ లీకేజీతో నీరు ఉధృతంగా ఎగజిమ్మాయి. భారీ ప్రెషర్‌తో నీరు ఉప్పొంగడంతో పరిసర ప్రాంతాలన్నీ జలమ యమయ్యాయి. బీర్కూర్ మండల కేంద్రంలో రోడ్డు వెడల్పు పనులు సాగుతున్నాయి ఇందులో భాగంగా రోడ్డు పనులకు వచ్చే వాహనాలు ఇతర వాహనాలు రావడంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలింది. దీనితో తాగునీరు వృథా అయ్యింది. దెబ్బతిన్న పైప్‌లైన్‌ను మరమ్మతు చేసేందుకు రెండు రోజుల సమయం పడుతుందని అధికారులు తెలిపారు. ఎగువ ప్రాంతంలో పైప్‌లైన్ ప్రవాహాన్ని నియంత్రించేలోపు లక్షల లీటర్ల నీరు నేలపాలైందని స్థానికులు చెబుతున్నారు. రోడ్డంతా జలమయం కావడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మిషన్ భగీరథ పైప్ లైన్ పగిలి తాగు నీరు ఎగజిమ్మడంతో రహదారిపై వెళ్లే ప్రయాణికులు సెల్ఫీలు దిగడంతో రోడ్డు రద్దీగా మారింది.

ఆశ్రమంలో వృద్ధుడి చేర్పింత



ఆర్థిక సహాయం అందిస్తున్న జర్నలిస్టులు

నవతెలంగాణ-బిచ్కుంద

బాన్సువాడ పట్టణానికి చెందిన విట్టల్ అనే వృద్ధునికి ఎలాంటి ఆసరా లేకపోవడంతో మీడియాలో పనిచేసే నలుగురు జర్నలిస్టులు ముందుకు వచ్చి వృద్ధాశ్రమంలో చేర్పించారు. వివరాల్లోకి వెళ్తే.. బాన్సువాడ పట్టణంలోని గూడెంగల్లీకి చెందిన వృద్ధుడు విట్టల్ అక్కడ ఇక్కడ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల ఓ ప్రమాదంలో వృద్ధుని కాలుకు దెబ్బ తగిలింది. దీంతో నడవలేని పరిస్థితిలో ఉండగా, అటు కుటుంబ సభ్యులు ఎవరూ పట్టించుకునేవారు లేకపోవడంతో విషయం తెలుసుకున్న బాన్సువాడ పట్టణానికి చెందిన ఆయా మీడియాలలో పనిచేస్తున్న నలుగురు జర్నలిస్టులు ముందుకు వచ్చి కామారెడ్డి సమీపంలోని ఉగ్రవాయి వృద్ధాశ్రమంలో చేర్పించారు. పలువురు దాతలు ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించారు. వృద్ధాశ్రమంలో చేర్పించిన జర్నలిస్టులను పలువురు అభినందించారు. వృద్ధునికి ఆసరా అందించి ఆశ్రమంలో చేర్పించిన జర్నలిస్టులు బాన్సువాడ పట్టణ సీవి మున్నూరు కృష్ణ, ఈగ రాజిరెడ్డి, సెవెన్ హిల్స్ ఆస్పత్రి యాజమాన్యం ప్రవీణ్‌రెడ్డి, నందిగామ శశికిరణ్‌రెడ్డి, మంత్రి మనోజ్ కుమార్, జాడే గోపాల్, ఉడుగుల సంజీవ్, సందేశ్ (సాఫ్ట్వేర్), సప్తగిరి గణేష్ ముందుకు వచ్చి ఆర్థికసాయం అందించారు. వృద్ధాశ్రమంలో చేరిపించిన టీవీ9మధుసూదన్‌రెడ్డి, రాజ్‌న్యూస్ రిపోర్టర్ కోటగిరి సతీష్, మనతెలంగాణ శ్రీనివాస్, వాస్తవం జిల్లా స్టాపర్ మారిశెట్టి హనుమాన్లు జర్నలిస్ట్ యువకులకు పలువురు అభినందించారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మందకృష్ణ మాదిగ



నవతెలంగాణ-బోధన్

మండలంలోని బెల్లాల్ గ్రామంలో మంగళవారం వికలాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షురాలు సుజాత సూర్య వంశీ నాన్న శ్యాంరావు వృద్ధాప్యంతో మృతిచెందారు. ఈ సమాచారం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ బెల్లాల్‌లో సుజాత సూర్యవంశీని పరామర్శించారు. అనంతరం శ్యాంరావు అంత్యక్రియలలో పాల్గొని పాడె మోశారు. సుజాత సూర్య వంశీ నాన్న శ్యాంరావు అకాల మరణం పట్ల ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. ఎంఎస్పి జాతీయ నాయకులు మాణికోళ్ల గంగాధర్, మాదిగ హక్కుల రాష్ట్ర అధ్యక్షులు అందె రాంబాబు, జిల్లా కనక ప్రమోద్ మాదిగ, ప్రధాన కార్యదర్శి లసింగరి భూమయ్య మాదిగ, జిల్లా నాయకురాలు పద్మ, సావిత్రి మాదిగ, జిల్లా ఉపాధ్యక్షులు ప్రవీణ్ మాదిగ, బోధన్ పట్టణ అధ్యక్షులు తాడెం అబ్బయ్య మాదిగ, సీనియర్ నాయకులు గంధమాల చంద్రయ్య మాదిగ, జాదవ్ ఫకీర నాయక్, స్వప్న, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లిలో నిత్యాన్నదానం

నవతెలంగాణ-ఎడపల్లి

గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని గణేష్ మండపాల నిర్వాహకులు నిత్యాన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. గణేష్ మండపాలను ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు. గణేష్ మండపాల వద్ద చిన్నారి బాల బాలికలు మహిళలు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఆటపాటలతో సందడి చేస్తున్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని అంబేద్కర్ యువజన గణేష్ మండపం వద్ద మంగళవారం ఎడపల్లికి చెందిన మచ్చూరి సురేష్ దంపతులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం నాయకులు దల్లా సురేష్, మచ్చూరి గంగాధర్, మొద్దోళ్ల సురేష్, బూడిది గంగాధర్, జగ్గరి మోహన్, సాయిలు, సుదర్శన్, ఏనుగు శ్రీనివాస్, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాయబాదిలో..

మండల కేంద్రంలోని నయబాదిలో జై హనుమాన్ గణేష్ మండపం వద్ద మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం నయబాది ప్రాంత భక్తులు వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంట నష్టాన్ని పరిశీలించిన వ్యవసాయాధికారులు



నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలో కురిసిన భారీ వర్షాలకు, నష్టపోయిన పంటలను ఏడిఏ ప్రసన్నలక్ష్మీ, మండల వ్యవసాయాధికారి ప్రజాపతితో కలిసి మంగళవారం పరిశీలించారు. మండలంలో పోసానిపేట, రంగంపేట, మోషన్‌పూర్, ఉప్పల్‌వాయి గ్రామాలకు చెందిన 60 మంది రైతులకు చెందిన 110 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు ప్రాథమిక అంచనా వేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో ఏఈఓ నికిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.